

ఈ-ఫైళ్ల పరిష్కారం వేగవంతం!

» కలెక్టర్, జేసీ చొరవతో సత్వర మోక్షం

అనకాపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ-ఫైల్స్ క్లియరెన్స్ వేగం పుంజుకుంది. గతంతో పోలిస్తే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత బాగా మెరుగుపడినట్టుని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం అమరావతిలో ఆర్థిక శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ల ఫైళ్ల క్లియరెన్స్ డేటాను విడుదల చేశారు. ఈ ఏడాది ... మిగతా 10వ పేజీలో

వాహనదారులకు పరీక్ష

- » వాహనాల ఫిట్‌నెస్ కోసం గంటల తరబడి వేచిఉండాల్సిన దుస్థితి
- » హైవే సర్వీసు రోడ్డుపై బారులు తీరుతున్న వాహనాలు
- » ఫిట్‌నెస్ పరీక్షలతోపాటు ఎఫ్‌సీ జారీలో తీవ్ర జాప్యం
- » వాహనాల యజమానులు, డ్రైవర్లు పడిగాపులు
- » నర్సీపట్నంలో మరో ఏటీఎస్ ఏర్పాటుకు ప్రతిపాదనలు
- » ఆరు నెలలైనా కార్యరూపం దాల్చని వైనం

మూడు జిల్లాలకు ఒక్కటే ఏటీఎస్



వాహనాల ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

సరుకు రవాణా వాహనాలతోపాటు ప్రయాణికులను తీసుకెళ్లే వివిధ రకాల వాహనాలు, విద్యా సంస్థలకు చెందిన బస్సులు, వ్యాన్లకు నిర్ణీత కాలంలో సామర్థ్య పరీక్షలు (ఫిట్‌నెస్ సర్టిఫికెట్) తప్పనిసరిగా నిర్వహించాలి. ఉమ్మడి విశాఖ జిల్లా అంతటికీ ఒకే ఒక్క కేంద్రం వుండడంతో వాహనాల ఫిట్‌నెస్‌లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. సబ్బవరం మండలం దేవీపురం వద్ద వున్న ఈ కేంద్రానికి సమీపంలో నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు బారులుతీరి కనిపిస్తున్నాయి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) కోసం యజమానులు/ డ్రైవర్లు గంటల తరబడి వేచి వుండాల్సి వస్తున్నది. ఆటోలు, లారీలు, బస్సులు, వ్యాన్‌లు వంటి వాహనాలను కొనుగోలు చేసిన ఎనిమిది సంవత్సరాల లోపు అయితే రెండేళ్లకు ఒకసారి, ఎనిమిదేళ్లు దాటితే ఏటా ఒకసారి ఫిట్‌నెస్ టెస్టింగ్ చేయించుకోవాలి.

ఏడాదిన్నర క్రితం వరకు వాహనాల ఎఫ్‌సీలు రవాణా శాఖ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ జారీ చేసేవారు. దీనివల్ల వాహనదారులకు ఎఫ్‌సీలు పొందడం సులభతరంగా ఉండేది. అయితే కేంద్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం గత ఏడాది ఏప్రిల్ నుంచి ఫిట్‌నెస్ టెస్టింగ్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. జిల్లాకు ఒకటి చొప్పున ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)లను ఏర్పాటు చేశారు.



ఫిట్‌నెస్ కోసం జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై వేచివున్న వాహనాలు

అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిపై సబ్బవరం శివారు దేవీపురం టోల్ ప్లాజాకు సమీపంలో ఏటీఎస్ వుంది. అయితే విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఏటీఎస్‌లను ఏర్పాటు చేయకపోవడంతో ఈ రెండు జిల్లాల వాహనాలను కూడా సబ్బవరం మండలంలోని ఏటీఎస్‌లో ఎఫ్‌సీలు జారీ చేస్తున్నారు. వాహనాల ఫిట్‌నెస్ టెస్టింగ్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. దీంతో ఉమ్మడి విశాఖపట్నంతోపాటు సరుకు లోడింగ్/ అన్‌లోడింగ్ నిమిత్తం విశాఖ నగరానికి వచ్చే ఇతర జిల్లాల వాహనాల యజమానులు కూడా ఎఫ్‌సీల కోసం సబ్బవరం ఏటీఎస్‌లో స్లాట్లు బుక్ చేసుకుంటున్నారు. దీంతో ఫిట్‌నెస్ పరీక్షలకు వాహనదారులు ఎక్కువ సమయం వేచివుండాల్సి వస్తున్నది. దీంతో వాహనాలను జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో నిలుపుదల చేస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నది. కొన్నిసార్లు రెండు, మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. పరీక్ష పూర్తయ్యే వరకు యాజమానులు/ డ్రైవర్లు రోడ్డుపైనే పడిగాపులు కాయాల్సి వస్తున్నది. మరోవైపు ఏటీఎస్‌లో సిబ్బంది కొరత, రవాణా శాఖ సర్వర్ తరచూ మొరాయిస్తుండడం వంటి కారణాలతో ఎఫ్‌సీల జారీ ఆలస్యం అవుతున్నది.

కాగా సబ్బవరం మండలంలోని ఏటీఎస్‌పై ఒత్తిడి పెరగడంతో నర్సీపట్నంలో మరో ఏటీఎస్‌ను ఏర్పాటు చేయాలని రవాణా శాఖ అధికారులు ప్రతిపాదన చేశారు. ఆరు నెలల కిందట జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఏటీఎస్ సబ్బవరం మండలంలో ఉండడం వల్ల నర్సీపట్నం పరిసర ప్రాంతాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన వాహన యజమానులు ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల నర్సీపట్నంలో ఏటీఎస్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి రవీంద్ర స్పందిస్తూ, స్పీకర్ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఇది జరిగి ఆరు నెలలు దాటినా మరో ఏటీఎస్ మంజూరు కాలేదు.

ఈ రోడ్లకు మోక్షమెన్నడో?

గ్రామీణ రహదారులకు వీడని గ్రహణం

- » అధ్వానంగా పీఎస్‌పేట-జన్నవరం, అంభేరుపురం-రాయపురాజుపేట మార్గాలు
- » వైసీపీ హయాంలో నిర్వహణను గాలికొదిలేసిన పాలకులు
- » కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటినా మొదలుకాని పనులు



చోడవరం- పీఎస్ పేట మధ్య గోతులు ఏర్పడిన రహదారి

చోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

మండలంలో అత్యంత అధ్వానంగా ఉన్న పీఎస్‌పేట- జన్నవరం, అంభేరుపురం, రాయపురాజుపేట రహదారులు ఎప్పుడు బాగుపడతాయా అని పలు గ్రామాల ప్రజలు కళ్లు కాయలుకాచేలా ఎదురు చూస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో శంకుస్థాపనలకే పరిమితంకాగా... కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా అభివృద్ధికి నోచుకోలేదు. పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది.



పీఎస్ పేట- జన్నవరం మధ్య ఆనవాళ్లు లేని తారు రోడ్డు



అంభేరుపురం- రాయపురాజుపేట రహదారి దుస్థితి

చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలను కలిపే చోడవరంలోని కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్‌పేట మీదుగా జన్నవరం వరకు రహదారి అభివృద్ధి పనులకు గత ప్రభుత్వ హయాంలో రూ.2.83 కోట్లు మంజూరయ్యాయి. శంకు స్థాపన అనంతరం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. అయితే ఈ రోడ్డు పనులకు గ్రాంటే లేదని తెలియడంతో పనులు ఆపేశారు. తరువాత అప్పటి ఎమ్మెల్యే భరోసా ఇవ్వడంతో కాంట్రాక్టర్ గత ఏడాది సాధారణ ఎన్నికల ముందు కన్నంపాలెం నుంచి జన్నవరం జంక్షన్ వరకు తారురోడ్డువేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో బిల్లులు రావేమోనన్న ఉద్దేశంతో పనులు ఆపేశారు. అప్పటికి సుమారు రూ.70 లక్షల మేర పనులు చేసినట్టు తెలిసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద చోడవరంలో కొత్తూరు జంక్షన్ నుంచి కిలోమీటరు మేర సీసీ రోడ్డు నిర్మించారు. ఇది జరిగి సుమారు ఏడాది కావస్తున్నది. మిగిలిన రోడ్డు అభివృద్ధికి సంబంధించి ఎటువంటి కదలిక లేదు. ఈ ఏడాది వర్షాకాలంలో చోడవరం-జన్నవరం రహదారి మరింత దారుణంగా తయారైంది. దీంతో చోడవరం మండలం జన్నవరం, చాకిపల్లి, కన్నంపాలెం, తిమ్మనపాలెం, బెన్నవోలుతోపాటు బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు చెందిన పలు ... మిగతా 10వ పేజీలో

వరహా నదికి కాలుష్య ముప్పు

చెత్తాచెదారాన్ని పడేస్తున్న పారిశుధ్య సిబ్బంది, స్థానికులు

- » కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన
- » కలుషితం అవుతున్న నీరు
- » పట్టించుకోని జలవనరులు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు



ఎస్.రాయవరం మండలం దార్లపూడి వైపు వరహా నదిలో పడేసిన చెత్త

ఎలమంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

వేలాది ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీటిని అందిస్తున్న వరహా నదిని కొంతమంది కాలుష్య కాసారంగా మార్చేస్తున్నారు. ముఖ్యంగా నదికి ఇరువైపులా వున్న గ్రామాల వద్ద చెత్తాచెదారాన్ని పడేస్తున్నారు. ఇది కుళ్లిపోయి నది నీటిని కాలుష్యం చేస్తున్నది. ఆయా పంచాయతీల పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్త డంపింగ్ నానాటికీ పెరిగిపోతున్నది.

కొయ్యూరు, గొలుగొండ మండలాల్లో పుట్టిన వరహా నది.. నర్సీపట్నం, కోటవురట్ల, ఎలమంచిలి, ఎస్.రాయవరం మండలాల మీదుగా ప్రవహిస్తూ బంగారమ్మపాలెం వద్ద సముద్రంలో కలుస్తుంది. కోటవురట్ల మండలం తరువాత ఈ నదికి అటు ఎస్.రాయవరం, ఇటు ఎలమంచిలి మండలాలు వున్నాయి. ఎలమంచిలి మండలం ఏటికొప్పాక, ఎస్.రాయవరం మండలం దార్లపూడి గ్రామాలు వరహా నదిని ఆనుకొనివున్నాయి. అయితే దార్లపూడి పంచాయతీ పారిశుధ్య సిబ్బంది గ్రామంలో సేకరించిన చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి నది గట్టుపై పడేస్తున్నారు. ఇక ఏటికొప్పాక పంచాయతీ సిబ్బంది చెత్తాచెదారాన్ని ఇక్కడ పడవేయనప్పటికీ పలువురు స్థానికులు భవన నిర్మాణ వ్యర్థాలను నది గట్టుపై డంప్ చేస్తున్నారు. ఇక్కడ చెత్తాచెదారం కొండలా పేరుకుపోయింది. గాలులు వీచినప్పుడు చెత్తాచెదారం ఎగిరి, నదిలో పడుతున్నది. వర్షాకాలంలో చెత్త కుళ్లిపోయి, మురుగు నీరు నదిలో కలుస్తున్నది. గతంలో వరహా నదిలో నీరు స్వచ్ఛంగా వుండేని, అయితే చెత్తాచెదారాన్ని పడేస్తుండడంతో నల్లగా మారి దుర్వాసన ... మిగతా 10వ పేజీలో

నేడు ఎలమంచిలి ఎంపీపీ ఎన్నిక

» ఇన్‌చార్జి ఎంపీపీ రాజాన శేషుకే అవకాశం?

ఎలమంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

ఎలమంచిలి మండల పరిషత్ అధ్యక్ష పదవికి గురువారం ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంపీపీగా వున్న సూర్య చంద్రశేషగిరిరావు(శేషు) ఎన్నిక కావడం దాదాపు ఖాయమైంది.

ఎలమంచిలి మండలంలో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలు వున్నాయి. సుమారు నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో అన్నిస్థానాల్లో వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. అప్పటి ఎమ్మెల్యే సూచనల మేరకు బోదెపు గోవిందును ఎంపీపీగా ఎన్నుకున్నారు. వైస్ ఎంపీపీలుగా రాజాన శేషు, శిలపరశెట్టి ఉమ ఎంపికయ్యారు. వాస్తవంగా ఎంపీపీ పదవిని రాజాన శేషు ఆశించారు. దక్కకపోవడంతో నిరాశ చెందారు. ఎంపీపీని నాలుగేళ్ల వరకు పదవి నుంచి దించే అవకాశం లేకపోవడంతో మిన్నకుండిపోయారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు రాజాన శేషు, ఎస్.ఉమ జనసేన పార్టీలో చేరారు. తరువాత మరో ఇద్దరు సభ్యులు బర్రె శివలక్ష్మి, నగిరెడ్డి అమ్మాజీలను తమ వైపునకు తిప్పుకున్నారు. ఏటికొప్పాక-2 సభ్యురాలు నగిరెడ్డి దేముడమ్మ మృతిచెందడంతో ఆ స్థానం ఖాళీగా వుంది. ఎంపీపీ గోవింద్‌పై అవిశ్వాసం శేషుతోపాటు నలుగురు సభ్యులు సెప్టెంబరు 24న ఆర్డీఓకు, ఇన్‌చార్జి ఎంపీడీఓకు నోటీసు అందజేశారు. అక్టోబరు 18వ తేదీన నిర్వహించిన ... మిగతా 10వ పేజీలో

బాల్యానికి మూడు ముళ్ల బంధనం

బాల్య వివాహాలను అరికట్టడానికి వంద రోజుల ప్రణాళిక

- » విద్యా సంస్థల్లో విస్తృత ప్రచారం
- » గ్రామ సభలు నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన



బాల్య వివాహాన్ని అడ్డుకొని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీడీపీవో

మాకవరపాలెం మండలం చింతలూరులో మైనర్ బాలికకు వివాహం చేయడానికి తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. అదే మండలంలో మరో బాల్య వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా సీడీపీవో రమణ చొరవ తీసుకొని మైనర్ బాలికను కళాశాలలో చేర్పించారు.

నర్సీపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

బాల్య విహాలను అరికట్టడానికి ప్రభుత్వ యంత్రాంగం ఎంతగా ప్రయత్నిస్తున్నా ఫలితం ఉండడం లేదు. మేనరికాలు, తల్లి దండ్రులు ఆరోగ్యం బాగోలేకపోవడం, నిరక్షరాస్యత, ప్రేమలో పడి కులాంతర వివాహం చేసుకుంటే కుటుంబ పరువు పోతుందనే కారణాలతో మైనారిటీ తీరకుండానే అమ్మాయిలకు వివాహాలు చేస్తున్నారు. నిరుపేద కుటుంబాలు, శివారు గ్రామాల్లో ఈ తరహా వివాహాలు అధికంగా జరుగుతుంటాయని అధికారులు చెబుతున్నారు. మానసికంగా, శారీరంగా పరిపక్వత లేని వయస్సులో పెళ్లి చేయడం వల్ల కలిగే ... మిగతా 10వ పేజీలో

బాల్య వివాహాలను అరికట్టాలి



బాల్య వివాహాలను అరికట్టడాన్ని అందరూ బాధ్యత తీసుకోవాలి. తల్లిదండ్రులు, బంధువులు బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు. చిన్నారుల ఉన్నత భవిష్యత్తును నాశనం చేయవద్దు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్టు తెలిస్తే.. టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 181, 112, 100లకు ఫోన్ చేసి సమాచారం అందించాలి.

సూర్య లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, అనకాపల్లి

అంగన్‌వాడీలకు కొత్త సెల్‌ఫోన్లు

వేగవంతమైన డిజిటల్ సేవలకు 5జీ సిమ్‌లు

- » జిల్లాకు చేరిన 1,991 ఫోన్లు
- » కార్యకర్తలు, సూపర్ వైజర్లు, బీపీసీలకు పంపిణీ



పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన సెల్ ఫోన్లు

నర్సీపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలను మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం 5జీ సిమ్ సపోర్ట్ చేసే సెల్‌ఫోన్లు పంపిణీ చేస్తున్నది. జిల్లాలోని తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 1,908 అంగన్‌వాడీ కేంద్రాలో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, 74 మంది సూపర్ వైజర్లు, తొమ్మిది మంది బ్లాక్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్లుకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం 1,991 సెల్‌ఫోన్లను జిల్లాకు పంపింది. ఇప్పటి వరకు 4జీ సెల్ ఫోన్ల కారణంగా సిగ్నల్స్ అందక పోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆన్‌లైన్ సేవలకు, ముఖ ఆధారిత హాజరుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఆందోళన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. దీంతో సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం.. 5 జీ సిమ్ సపోర్ట్ చేసే శామ్ సంగ్ సెల్ ఫోన్లను సరఫరా చేసింది. కంపెనీ సాంకేతిక నిపుణులు త్వరలో ఐసీడీఎస్ ప్రాజెక్టులకు వచ్చి సాఫ్ట్‌వేర్ అనుసంధానం చేస్తారని సమాచారం.

బాలికను గర్భవతిని చేసిన నిందితుడి అరెస్టు

పోక్సో చట్టం కింద కేసు నమోదు

- » కేజీబీవీలో అధికారుల విచారణ
- » విధుల నుంచి ప్రిన్సిపాల్ తొలగింపు

గొలుగొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

మండలం కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థిని గర్భవతి కావడానికి కారణమైన వ్యక్తిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు చేశారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. దీనికి సంబంధించి ఎస్ఐ రామారావు తెలిపిన వివరాలిలా వున్నాయి. గొలుగొండ మండలంలో ఒక గ్రామానికి చెందిన బాలిక స్థానిక కేజీబీవీలో పదో తరగతి చదువుతున్నది. మూడు రోజుల క్రితం వాంతులు కావడంతో పాఠశాల సిబ్బంది వైద్య సేవలు అందించారు. అయినా వాంతులు తగ్గకపోవడంతో మరుసటి రోజు అనుమానం వచ్చి పరీక్ష చేయించగా బాలిక గర్భవతి అని తేలడంతో అమ్మమ్మకు కబురు చేశారు. సోమవారం ఆమె కేజీబీవీకి వచ్చి మనవరాలిని ఇంటికి తీసుకువెళ్లింది. దీనిపై బుధవారం మీడియాలో వార్తలు రావడంతో స్పందించిన పోలీసులు.. వెంటనే బాలిక వుంటున్న గ్రామానికి వెళ్లి విచారించారు.

కొయ్యూరు మండలంలో వుంటున్న ఆమె తల్లిని కూడా రప్పించారు. బాలిక చెప్పిన వివరాల మేరకు అదే గ్రామానికి చెందిన సతీశ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిని అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సాయంత్రం బాలికను, నిందితుడిని వైద్య పరీక్షల నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం నిందితుడిని న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. తరువాత విశాఖలోని కేంద్ర కారాగారానికి తరలించారు.

కాగా కేజీబీవీలో చదువున్న బాలిక గర్భందాల్చిన విషయం తెలుసుకున్న డీసీడీవో జమీమా, రూరల్ సీఐ రేవతమ్మ, ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరి బుధవారం ఉదయం కేజీబీవీకి వెళ్లి సిబ్బందిని విచారించారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్‌కు నివేదించారు. ఆమె ఆదేశాలతో ప్రిన్సిపాల్ సుధను విధుల నుంచి తొలగించినట్టు డీసీడీవో జమీమా తెలిపారు.

చురుగ్గా రైతుబజారు పనులు

పక్షం రోజుల్లో ప్రారంభించేందుకు అధికారుల సన్నాహాలు



ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో రైతుబజారుకు కేటాయించిన బ్లాకుకు రంగులు వేస్తున్న దృశ్యం

అనకాపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేయనున్న రైతుబజారుకు సంబంధించిన పనులను మార్కెటింగ్ శాఖ అధికారులు వేగంగా చేయిస్తున్నారు. యార్డులో 17, 18 బ్లాకులను రైతుబజారు కోసం అధికారులు కేటాయించిన విషయం తెలిసింది. రైతులు కూరగాయలు అమ్ముకునేందుకు వీలుగా ప్లాట్ ఫారాలను నిర్మించారు. దుకాణాలకు నంబర్లు వేశారు. ప్రస్తుతం రెండు బ్లాకులకు రంగులు వేస్తున్నారు. మరో పక్షం రోజుల్లో పనులన్నీ పూర్తి చేసి రైతు బజారును అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు.

'హక్కులకు భంగం కలిగితే కోర్టును ఆశ్రయించండి'



ఎలమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, న్యాయమూర్తులు

ఎలమంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సముదాయం ఆవరణలో బుధవారం జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.రమేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మానవునిగా పుట్టిన ప్రతి వ్యక్తికి సహజంగా లభించే హక్కులు, స్వేచ్ఛ ప్రపంచ వ్యాప్తంగా వర్తిస్తాయన్నారు. ఎవరికైనా హక్కులకు భంగం కలిగినప్పుడు స్వతంత్రంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునని స్పష్టం చేశారు. ప్రధానంగా చట్టాలపై అందరికీ అవగాహన అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ ఎల్వి.రామకృష్ణారావు, సభ్యులు, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం


రైతులకు మట్టి నమూనాల గురించి వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఆశాదేవి

ఎలమంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఆశాదేవి సూచించారు. ఎలమంచిలిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల చెంతకే అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ప్రధానంగా వ్యవసాయాధికారుల సూచనలను విధిగా పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చునన్నారు. అనంతరం మట్టి నమూనాలు సేకరించిన రైతులకు హెల్త్ కార్డుల పంపిణీతో పాటు, పొటాష్ రిలీజియన్ బ్యాక్టీరియా గురించి వివరించారు. వ్యవసాయ సంచాలకులు సుమంత, ఏవో మోహన్‌రావు, విస్తరణాధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలని నిరసన


అచ్యుతాపురం హైస్కూల్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

అచ్యుతాపురం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ డిమాండ్ చేశారు. 2010 సంవత్సరానికి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని కోరుతూ అచ్యుతాపురం హైస్కూల్‌లో ఉపాధ్యాయులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు ఈ విషయంలో ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. టెట్‌పై సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. అనంతరం యూటీఎఫ్ ప్రతినిధులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారిశెట్టి వెంకట అప్పారావు, మహిమారావు, గణేశ్, నలీం, కొండబాబు, అరుణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల నివేదిక సిద్ధం చేయండి

» నియోజకవర్గ అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆదేశం » అర్హులందరికీ పథకాలు అందించాలని సూచన


నియోజకవర్గ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అచ్యుతాపురం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో గల ప్రభుత్వ స్థలాల వివరాలతో నివేదిక అందజేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సూచించారు. అచ్యుతాపురంలో బుధవారం ఆయన ఎలమంచిలి నియోజకవర్గ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు మండలాల పరిధిలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులకు కేటాయించేందుకు భూముల వివరాలు ముందస్తుగా సేకరించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వ భూముల నివేదిక సిద్ధం చేయాలన్నారు. వచ్చిన దరఖాస్తుల పురోగతిని కూడా తెలుసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన వారి పింఛన్లను సైతం రద్దు చేశారని, అటువంటి వారందరికీ ప్రభుత్వ పథకాలు తప్పనిసరిగా అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలను పరిష్కరించండి'

ఎలమంచిలి : పట్టణంలో ప్రతివారం నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమం దృష్టికి వస్తున్న సమస్యలపై అధికారులు అలక్ష్యం చూపవద్దని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అన్నారు. ఇక్కడి జడ్పీ అతిథి గృహంలో బుధవారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నాలుగు మండలాల నుంచి వచ్చిన పలువురితో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బొద్దపు శ్రీను, ఊటకూటి రమేష్, కొఠారు శ్రీను, గుర్రాల శేఖర్, లాలం సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మల్లవరం కొండ తవ్వకాలు!

» పట్టించుకోని అధికారులు
» ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు


మల్లవరం కొండ వద్ద చేపట్టిన తవ్వకాలు

మునగపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లవరం కొండపై ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. అనుమతులున్నా పరిమితికి మించి తవ్వకాలు చేపడుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు ప్రశాంతంగా ఉండే మల్లవరం గ్రామం రాత్రి సమయంలో ట్రాక్టర్లు, లారీల హారన్ల మోతతో హడావుడిగా మారుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. భారీగా తవ్వకాలు చేపడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు భయాందోళన చెందుతున్నారు. మైనింగ్ విభాగం ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు స్థానిక అధికారుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

'సెజ్'కు సెంటు భూమి ఇచ్చేది లేదు

» ఏపీఐఐసీ డిప్యూటీ కలెక్టర్ అనితకు తేల్చి చెప్పిన పూడిమడక రైతులు


డిప్యూటీ కలెక్టర్ అనితకు మెమోరాండం సమర్పిస్తున్న పూడిమడక రైతులు

అచ్యుతాపురం రూరల్, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి) : సెజ్‌కు సెంటు భూమి కూడా ఇచ్చేది లేదని పూడిమడక గ్రామ రెవెన్యూ పరిధిలో గల రైతులు తేల్చి చెప్పారు. ఏపీఐఐసీ డిప్యూటీ కలెక్టర్ అనిత ఆధ్వర్యంలో బుధవారం పూడిమడక పట్టాదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూడిమడక రెవెన్యూ పరిధిలో గతంలో 4-1 నోటీసులు జారీ చేశామని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టుల కోసం భూసేకరణ జరుగుతుందని రైతులకు తెలియజేశారు. అయితే రైతులు 1894 భూసేకరణ చట్టం ప్రకారం 2006లో ఇచ్చిన 4-1 నోటీసులు చెల్లవని అభ్యంతరం వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం కింద సామాజిక ప్రభావాన్ని అంచనా వేసి భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. గ్రామసభ అనుమతి లేకుండా భూసేకరణ జరగకూడదని స్పష్టం చేశారు. గతంలో 4-1 నోటీసులు జారీ చేసిన 5.27 ఎకరాల్లో ఇప్పటికే 280 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారన్నారు. ఇదే భూముల్లో ఎన్‌డీఏ ప్రభుత్వం రూ.3.25 కోట్ల వ్యయంతో రెండు తుఫాన్ రక్షిత భవనాలను కూడా నిర్మించినట్టు చెప్పారు. 2018లో రైతుల అనుమతి లేకుండా ఆన్‌లైన్‌లో పట్టాదారుల వివరాలను అన్యాయంగా తొలగించారని ఆరోపించారు. పూడిమడక ప్రజలకు నష్టం కలిగించే భూసేకరణను తాము వ్యతిరేకిస్తున్నట్టు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు మేరుగు రాజుబాబు, వాసుపల్లి శ్రీనివాసరావు, ఉమ్మిడి అప్పారావు, వజ్రపు శంకరరావు, ఉమ్మిడి జగన్ తదితరులు పాల్గొన్నారు.

తగాదాలు వీడి ఉత్సవాన్ని ఐక్యంగా జరుపుకోండి : సీఐ


గ్రామస్థులతో సమావేశమైన సీఐ ధనుంజయరావు

మునగపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉత్సవం నిర్వాహణ గురించి నెలలు తరబడి తగాదాలు పడటం సరికాదని సీఐ ధనుంజయరావు అన్నారు. గణపర్తి గ్రామంలో బుధవారం ఎస్ఐ పి.ప్రసాదరావుతో కలిసి పర్యటించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి సమావేశమయ్యారు. తగాదాలు కారణంగా ఇప్పటికే జరగాల్సిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం వాయిదా పడిన విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఎటువంటి విభేదాలకు తావులేకుండా వేడుకను ఐక్యంగా జరుపుకోవాలన్నారు.

'పల్స్‌పోలియోను విజయవంతం చేయండి'


రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్

అచ్యుతాపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ చంద్రశేఖర్ దేవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రం అచ్యుతాపురంలో గల పీహెచ్‌సీని ఆయన బుధవారం తనిఖీ చేసి మాట్లాడారు. ఈ నెల 21న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమం కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పలు సూచనలు చేశారు. అనంతరం పూడి కాలనీలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ కె.శ్రావ్య, సామాజిక ఆరోగ్య అధికారి జి.డి.కృపాచార్యులు, పర్యవేక్షకుడు అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ అఖిలభారత మహా సభలను జయప్రదం చేయండి

రాంబిల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరంలో ఈ నెల 31 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు జరగనున్న సీఐటీయూ అఖిలభారత మహా సభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. బుధవారం రాంబిల్లిలో ఆయన పలువురు యూనియన్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావాల్సిందిగా కోరారు. నాయకులు జి.దేముడునాయుడు, చందక రామకృష్ణ, దోని కాశియ్య, ఎం.రమణ పాల్గొన్నారు.

'పేటలో ఆక్రమణల తొలగింపు


పీహెచ్‌సీ ప్రహరీని ఆనుకుని ఉన్న షెడ్లను తొలగించిన దృశ్యం

పాయకరావుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట పలువురు అక్రమంగా ఏర్పాటుచేసిన షెడ్లను తొలగిస్తున్నారు. ఇటీవల పాయకరావుపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీచేసిన హోం మంత్రి వంగలపూడి అనిత, ఆసుపత్రి ఎదుట ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో కొద్ది రోజుల క్రితం రెవెన్యూ, పోలీసు అధికారులు పీహెచ్‌సీ ప్రహరీ గోడను ఆనుకుని ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆదేశించారు. లేనిపక్షంలో తామే తొలగింపు చర్యలు చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా వీటికి విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని విద్యుత్ శాఖను కోరారు. దీంతో షెడ్లు ఏర్పాటు చేసుకున్న వారంతా స్వచ్ఛందంగా తొలగించుకునే పనులు చేపట్టారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావాలంటే పీహెచ్‌సీ ఎదుట షెడ్లనే కాకుండా తాండవ వంతెన నుంచి వై జంక్షన్ వరకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను కూడా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

టెట్ నుంచి మినహాయించాలని నిరసన


తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సంఘ ప్రతినిధులు

నక్కపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టెట్ నుంచి సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్వీస్‌లో చేరి రెండు, మూడు దశాబ్దాలు గడచిన వారికి కూడా టీచర్ అర్హత పరీక్ష కచ్చితంగా పాస్ అవ్వాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఉపాధ్యాయులంతా ఆందోళనకు గురవుతున్నారని ఈ సందర్భంగా యూటీఎఫ్ ప్రతినిధులు వాపోయారు. సుప్రీం కోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల తరపున రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గారా రాజబాబు, ప్రధాన కార్యదర్శి కళింగ సతీశ్, గౌరవ అధ్యక్షుడు డీఆర్‌కే శాస్త్రి, సంఘ ప్రతినిధులు చిరంజీవి, సత్యనారాయణ, వెంకట్రావు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో...

పాయకరావుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కేఎస్ఆర్‌కే.రాజు మాట్లాడుతూ 30 సంవత్సరాల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు టెట్ రాస్తేనే వృత్తికి అర్హులనే మాటకు అర్థం లేదన్నారు. ఉపాధ్యాయులు అనుభవమే వారి అర్హత అన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కట్టా లోవరాజు, నాయకులు శ్రీరామచంద్రమూర్తి, డీజేఎన్‌జే.ప్రసూనాంబ, అపర్ణ, డి.ఐజాక్, లక్ష్మణరావు, సూరిబాబు, డి.అప్పారావు, చంటి, నాగరాజు, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజా ప్రతినిధుల ధ్వజం

గ్రామాల్లో ఉద్యోగులు సక్రమంగా పనిచేయడం లేదని మండిపాటు
మంగవరం పీహెచ్‌సీలో పారిశుధ్య లోపం, మందుల కొరతపై అసంతృప్తి
వాడీవేడిగా పాయకరావుపేట మండల సర్వసభ్య సమావేశం



వ్యవసాయాధికారిని నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యుడు నరేశ్

పాయకరావుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో సమస్యలపై ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. గ్రామాల్లో ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండడం లేదని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీపీ పార్వతి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. తొలుత ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ గత మండల సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల అధికారుల సమాధానాలను చదివి వినిపించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల పనితీరును వివరించారు. ఏవో మాట్లాడుతున్న సమయంలో ఎంఎస్.పేట ఎంపీటీసీ సభ్యుడు కె.నరేశ్ అడ్డు తగులుతూ, సిబ్బంది గ్రామానికి ఎప్పుడు వస్తున్నారో తెలియడం లేదని, మొంథా తుపానులో తమలపాకుల తోటల నష్ట పరిహారంలో అనర్హులను చేర్చారని ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని తెలిపారు. అలాగే పంటల నమోదులో రైతు భూమి వద్ద వివరాలు సేకరించకుండా నమోదుచేస్తున్నారని, దీనివల్ల రైతు వేసిన పంట విస్తీర్ణం ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. పలు సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ లేక ఉద్యోగులు ఖాళీగా కూర్చొని వెళ్తున్నారని, దీంతో పనులు పూర్తికాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తీర ప్రాంతంలో అను మతులు లేకుండా చేపలు, రొయ్యల చెరువుల నిర్వహణ వల్ల నీరు, గాలి కలుషితమైన ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, వీటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని వెంకటనగరం సర్పంచ్ వెంకటమణ ప్రశ్నించారు. అదేవిధంగా గోపాలపట్నం ఎంపీటీసీ సభ్యుడు సతీష్‌రాజు మాట్లాడుతూ మంగవరం పీహెచ్‌సీలో ప్రజలకు అవసరమైన మందులు లేకపోగా ఆసుపత్రిని శుభ్రం చేయడంలేదని వాపోయారు. శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంటున్నదని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో బెల్టు షాపులు పెరిగిపోయాయని, వీటిపై ఎక్సైజ్ శాఖ తీసుకుంటున్న చర్యలు ఏమీ లేవని ఆరోపించారు. అనంతరం ఎంపీడీవో విజయలక్ష్మి సమాధానం ఇస్తూ గ్రామాల్లో పారిశుధ్యం ఇతర నిర్వహణ పనుల బాధ్యత ఆయా పంచాయతీల కార్యదర్శులు, ఇతర సిబ్బందిదేనన్నారు. సచివాలయాల సిబ్బంది పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, తహసీల్దారు ఎస్ఏ.మహేశ్వరరావు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో సీనరేజ్ వసూళ్లపై దుమారం

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల గరం గరం


సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ప్రజా ప్రతినిధులు

కోటవురట్ల, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): అనధికార చెక్‌పోస్టులు పెట్టి గ్రావెల్, ఇసుక, మెటల్, రాయి రవాణా చేస్తున్న వాహనాల నుంచి సీనరేజ్ వసూళ్లు చేయడం సరికాదని సభ్యులు మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం గరం గరంగా సాగింది. జడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి మాట్లాడుతూ గొట్టివాడ వద్ద అనధికార చెక్‌పోస్టు గురించి అధికారులకు తెలుసా? లేదా? అని ప్రశ్నించారు. తమకు తెలియదని అధికారులు బదులు ఇవ్వగా, అంత ధైర్యంగా చెక్‌పోస్టులు పెట్టి సీనరేజ్ వసూళ్లు చేయడమేమిటని పలువురు ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. తహశీల్దార్ తిరుమలబాబు మాట్లాడుతూ మైనింగ్ శాఖ అనుమతులతో సీనరేజ్ వసూళ్లు చేస్తున్నారేమోనని చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు పి.సూర్యారావు మాట్లాడుతూ సీతారామరాజునగర్ కాలనీని సర్వే నంబర్ 202లో ఎండోమెంట్ ల్యాండ్‌గా గుర్తించడంతో ఇళ్లు, భూముల క్రయవిక్రయాలు జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఈ సమస్య ఎండోమెంట్ కమిషనర్ వద్ద పరిష్కరించుకోవాలని బదులిచ్చారు. కాగా ఇళ్ల దరఖాస్తుల ప్రక్రియ విషయమై వైసీపీ, టీడీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల మధ్య తీవ్రంగా వాదోపవాదాలు జరిగాయి. ఒకానొక సందర్భంగా అరుపులు, కేకలతో సమావేశం దద్దరిల్లిపోయింది. డాక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన పల్స్‌పోలియో కార్యక్రమంలో 0-5 ఏళ్ల పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్టు తెలిపారు. ప్రజలు స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే నర్సీపట్నం మండలం వేములపూడిలో ఒక కేసు నమోదైందని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, మండల ఇంజనీర్ వర్మ, పంచాయతీరాజ్ శాఖ ఏఈ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంటుకు అదనపు భూములు ఇవ్వం'

నక్కపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటు టౌన్ షిప్‌నకు అదనపు భూములు ఇవ్వమని నెల్లిపూడి గ్రామస్థులు స్పష్టం చేశారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఇప్పటికే స్టీల్‌ప్లాంట్ కోసం ప్రభుత్వం 2020 ఎకరాలను సేకరించిందని, మరో 440 ఎకరాల భూములను నెల్లిపూడి రెవెన్యూలో సేకరించాలని నిర్ణయించడం సమంజసం కాదని సీపీఎం నేత అప్పలరాజు చెప్పారు. అందువల్ల అదనపు భూ సేకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.రాజేశ్, రైతు సంఘ నాయకులు పేర్రాజు, అప్పలరాజు, రమేశ్‌రాజు, నానాజీ, జోగిరాజు పాల్గొన్నారు.

లిటరసీ కార్యాచరణ పకడ్బందీగా అమలుచేయాలి

ఎస్.రాయవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): లిటరసీ, న్యూమరసీ కార్యాచరణ ప్రణాళికను పగడ్బందీగా అమలు చేయాలని ఎంఈవో-2 కర్రి శ్రీరామమూర్తి ఆదేశించారు. ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ఎంఈవో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1-5 విద్యార్థులకు చదవడం, రాయడంతో పాటు లెక్కలు చేయడం తప్పనిసరిగా రావాలని స్పష్టం చేశారు. 75 రోజుల కార్యచరణ ప్రణాళిక పూర్తయ్యేలోపు కింది స్థాయిలో విద్యార్థులందరూ అన్ని సామర్థ్యాలలో ప్రావీణ్యం సాధించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు పని చేయాలని ఎంఈవో ఆదేశించారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పాయకరావుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ పురుషోత్తం సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం గంజాయి, సైబర్‌క్రైమ్, డిజిటల్ అరెస్టు, ర్యాగింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ, అధ్యాపకులు పాల్గొన్నారు

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

నక్కపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక, దోసలపాడు, కాగిత, వేంపాడు తదితర గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది వరి కోతలను పరిశీలించారు. ప్రస్తుతం చాలా చోట్ల వరి పొలాలు గింజ గట్టి పడే దశలోనూ, మరి కొన్ని కోత దశలోనూ ఉన్నాయని ఏవో చెప్పారు. ఆలస్యంగా ఊడిచిన వరి పొలాలకు ఇంకా సమయం ఉందన్నారు. అనంతరం పంట కోత ప్రయోగాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

నక్కపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఒక లక్ష్యం మేరకు విద్యార్థులు నిరంతరం శ్రమించాలని సూచించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల బాలికలు చేసిన నృత్య ప్రదర్శనలు, విద్యార్థుల చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యువత సేవాభావం అలవర్చుకోవాలని, ఇందుకు ఎన్ఎస్ఎస్ శిబిరాలు దోహదపడతాయని తహశీల్దార్ ఎస్ఏ.మహేశ్వరరావు చెప్పారు. మండలంలోని అరట్లకోట గ్రామంలో స్పేసెస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మానవ హక్కులు పరిరక్షించే బాధ్యత యువతపై ఉందన్నారు. ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో నేత్ర, దంత వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.అప్పలనర్స, శ్రీప్రకాశ్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ భానుమూర్తి, పీవో పి.భాస్కరరావు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించాలని ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించే పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు బుధవారం పట్టణంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం, ఆర్డీవో కార్యాలయం వద్ద మెడకు ఉరి తాళ్లు తగిలించుకున్నట్టు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ ధాన్యం, పత్తి, మొక్క జొన్న, అరటి తదితర పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా బోనస్ ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలన్నారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని, కౌలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని ఇవ్వాలని, అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న ప్రతి రైతు కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని కోరారు. పార్టీ నాయకులు పరమేశ్వరి, ఫణీంద్రకుమార్, దేముడుబాబు, రాజు, రైతు సంఘం నాయకులు కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలతో తీవ్ర అనర్థాలు'



దిబ్బపాలెం హైస్కూల్‌లో మాట్లాడుతున్న అసిస్టెంట్ సీడీపీవో శశికళ

తుమ్మపాల, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల వల్ల తీవ్ర అనర్థాలు చోటు చేసుకుంటాయని ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీవో శశికళ పేర్కొన్నారు. ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం దిబ్బపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల శారీరక, మానసిక రుగ్మతలకు లోనయ్యే ప్రమాదం ఉందన్నారు. పలు సందర్భాలలో ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుత జనరేషన్‌లో బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముక్తభారత్ ప్రాజెక్ట్ అధికారి కె.మనోహర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడుకు ఘన నివాళి



అప్పలనాయుడు విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరుల నివాళి

పరవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే పైలా అప్పలనాయుడు (నాయుడుబాబు) 21వ వర్ధంతిని బుధవారం పరవాడలో నిర్వహించారు. సంతబయలు వద్ద గల ఆయన కాంస్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులతో పాటు జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరవాడ ప్రాంత అభివృద్ధికి పైలా చేసిన కృషిని ఈ సందర్భంగా వారు కీర్తించారు. స్థానిక నాయకులు గండి రవికుమార్, పైలా అప్పారావు, చుక్క రామునాయుడు, బైయలపూడి భగవాన్ జయరాం, కోన రామారావు, బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, పైలా అప్పలనాయుడు, బుదర రాజు, వెన్నెల అప్పారావు, పైలా సత్యనారాయణ, బొద్దపు చిన్నారావు, గొర్లి గోపి, సర్పంచులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. అలాగే బొంకుదిబ్బయూత్ ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం : సెర్ప్ డీపీఎం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ

పరవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.వెంకటరమణ అన్నారు. ఇక్కడి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 2026-27 వార్షిక ప్రణాళికపై బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మహిళల ఆరోగ్యం, విద్య, సామాజిక భద్రత, సుస్థిర జీవనోపాధి, వ్యవసాయం లక్ష్యాలను సాధించేందుకు వార్షిక ప్రణాళిక దోహదపడుతుందన్నారు. అనంతరం పలు సలహాలు, సూచనలు చేశారు. శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బి.రంగారావు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు గణేశ్, అబ్దుల్, విజయకుమారి, పైడమ్మ, గ్రామ సంఘాల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో లక్ష్యసాధన : సీఐ రామచంద్రరావు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ రామచంద్రరావు

సబ్బవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సీఐ జి.రామచంద్రరావు అన్నారు. బుధవారం ఇక్కడి ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. 14- 18 ఏళ్ల వయస్సు గల బాలబాలికలు తమకు అన్నీ తెలుసు అనే భావనలో ఉంటారని ఇది సరికాదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయలు చెప్పే నిజాలు గ్రహించాలన్నారు. మంచి ప్రవర్తన గల విద్యార్థులు జీవిత లక్ష్యాలను సాధించగలరన్నారు. బాలికలు, మహిళలకు ప్రయాణాల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే 100కు సమాచారమిస్తే పోలీసులు రక్షణ కల్పిస్తారని వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి, రోడ్డు భద్రత వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ కె.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించండి

▸▸ ఆర్డీవోకు 'సుజల స్రవంతి' నిర్వాసితుల వినతి



ఆర్డీవో ఆయేషాకు వినతి పత్రం అందజేస్తున్న నిర్వాసితులు

తుమ్మపాల డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : సుజల స్రవంతి ప్రాజెక్టు ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని లేదా తమ భూములకు ఆన్‌లైన్‌లో రెడ్ మార్క్ తొలగించాలని తుమ్మపాల రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం అనకాపల్లిలో ఆర్డీవో ఆయేషాను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు రైతు మండల అధ్యక్షుడు పీలా బుజ్జి మాట్లాడుతూ సుజల స్రవంతి ప్రాజెక్టుకు సత్యనారాయణపురం రెవెన్యూ పరిధిలో గల తమ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఏళ్లు గుడుస్తున్నా నేటి వరకు ఎలాంటి పరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. పైగా ఆన్‌లైన్‌లో తమ భూములను రెడ్ మార్కులో పెట్టారని వాపోయారు. దీంతో తమ భూములపై ఎలాంటి లావాదేవీలు జరుపుకునే అవకాశం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పీలా మురళి తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి



సీఎం సహాయనిధి మంజూరు పత్రం అందిస్తున్న రాంకీ

కొత్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి అభాగ్యులకు అండగా నిలుస్తుందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) అన్నారు. మేజర్ పంచాయతీ కొత్తూరులో బుధవారం పర్యటించి అనారోగ్యానికి గురైన వారిని పరామర్శించారు. అనంతరం సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, కోన శ్రీను, మేడిశెట్టి నూకరాజు, రాంబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబీ, చదరం నాగేశ్వరరావు, నందారపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో పంటలకు మేలు

కశింకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవన ఎరువుల వినియోగంపై మండలంలోని జి.భీమవరంలో రైతులకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి స్వప్న మాట్లాడుతూ జీవన ఎరువులు పాస్ఫో బ్యాక్టీరియా, అజిటో బ్యాక్టీరియా, అజస్పిరిల్లమ్ ఎకరాకు 500 మిల్లీ లీటర్ల చొప్పున వంద కేజీ పొడు గెత్తంలో కలుపుకొని చల్లాలని సూచించారు. దీనిని అన్ని రకాల పంటలకు వాడుకోవచ్చునని వివరించారు. ఆత్మ ఏటీఎం రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు పంట పొలాలకు జీవన ఎరువుల వాడకం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అమలవుతున్న పథకాలు, రాయితీలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌కో సిమెంటు ఫ్యాక్టరీని పరిశీలించిన అధికారుల బృందాలు

▸▸ కాలుష్యం తనిఖీకి పరికరాలు ఏర్పాటు

▸▸ గైరమ్మ చెరువు ప్రాంతంలో నిర్మించిన సర్వీసు రోడ్డుపై ఆరా



గైరమ్మ చెరువులో నిర్మించిన సర్వీస్ రోడ్డును పరిశీలిస్తున్న ఎన్‌హెచ్-16 అధికారులు



పొల్యూషన్ తనిఖీకి ఏర్పాటు చేసిన పరికరాలు

కశింకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏఎస్ పేటలో ఉన్న రామ్‌కో సిమెంటు ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాలను అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. కంపెనీ నుంచి తీవ్ర స్థాయిలో కాలుష్యం విడుదలవుతుందని, దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు బుద్ద వెంకటరమణ, కోన నాగేశ్వరరావు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, సత్తిబాబు తదితరులు జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ విభాగం అధికారులు, కార్మిక శాఖ అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో కంపెనీని పరిశీలించారు. కాలుష్యం ఎంత మేరకు విడుదలవుతుందనే అంశాల పరిశీలనకు నాలుగు వైపులా పొల్యూషన్ నిర్ధారణ పరికరాలను అమర్చారు. గురువారం సాయంత్రం ఆరు గంటల వరకు పరిశీలించి అనంతరం ల్యాబ్‌కు పంపించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సదరు అధికారులు తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముకుందరావు ఆధ్వర్యంలో పది మందితో కూడిన బృందం ఈ పరిశీలనలో పాల్గొంది. అంతేకాకుండా 16వ నంబరు జాతీయ రహదారి ప్రాజెక్టు అధికారులు, మరో పది మంది కంపెనీ వద్దకు చేరుకొని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గైరమ్మ చెరువు ప్రాంతంలో నిర్మించిన సర్వీసు రోడ్డును పరిశీలించారు. అలాగే కార్మిక శాఖ అధికారులు కూడా కంపెనీని సందర్శించారు. నివేదికలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్టు చెప్పారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం



డైట్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు



బహుమతులు అందుకున్న కశింకోట జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ మానవ హక్కుల ప్రాముఖ్యతను వివరించారు. గౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అందరికీ లభించాలనే భావాన్ని ప్రతిఒక్క భారతీయ పౌరుల్లో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌ఈ విభాగాధిపతి కె.సుజాత, గోపాలమ్మ, ఎన్‌సీసీ ప్రొగామ్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని నెహ్రూచౌక్‌లో సర్వేజన ఐక్య వేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరమేష్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు, నాగేంద్ర గణేష్, సంతోష్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : ఇక్కడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్టేట్ డైరెక్టర్ కోట సన్నీజేమ్స్ మానవ హక్కులపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవడం, వాటిని కాపాడుకోవడం గురించి వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయరజిని, ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు శ్రీదేవి, టి.రేవతి, ఆచంట రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో అనకాపల్లి నియోజకవర్గం

▸▸ రోడ్ల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు

▸▸ కూటమి నాయకులు వెల్లడి



సమావేశంలో పాల్గొన్న కూటమి పార్టీల నాయకులు

కొత్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కృషితో అనకాపల్లి నియోజకవర్గం అభివృద్ధి పథకంలో దూసుకుపోతోందని జనసేన నాయకుడు చదరం నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి వెంకట సన్యాసినాయుడు, కశింకోట పీఏ సీఎస్ చైర్‌పర్సన్ సిదిరెడ్డి శ్రీను, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు అన్నారు. అనకాపల్లి రింగు రోడ్డులో ఉన్న జనసేన కార్యాలయంలో బుధవారం అనకాపల్లి, కశింకోట మండలాల నాయకులతో అభివృద్ధి పనులపై ఏర్పాటైన సమావేశంలో వారు మాట్లాడారు. కశింకోట మండలం జాతీయ రహదారి నుంచి విస్సన్నపేట వెళ్లే రోడ్డుకు, గోకువానిపాలెం అప్రోచ్ రోడ్డుకు, నర్సీపట్నం రోడ్డు నుంచి అచ్చెర్లకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి, ఆర్‌ఈసీఎస్ రోడ్డు నుంచి కచ్చర్లపాలేనికి, తీడ నుంచి అచ్చెర్లకు, జాతీయ రహదారి నుంచి ఉగ్గినపాలెం రోడ్డుకు, మోసయ్యపేట నుంచి అచ్చెర్ల జంక్షన్ రోడ్డుకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరయ్యాయన్నారు. అంతేకాకుండా అనకాపల్లి మండలం వెంకుపాలెం నుంచి కుంచంగికి వెళ్లే రోడ్డుకు, కూండ్రం నుంచి ఆర్.భీమవరం గ్రామానికి వెళ్లే రోడ్డుకు, కేబీ రోడ్డు నుంచి మొండిపాలెం వరకు, కేబీ రోడ్డు నుంచి తమ్మయ్యపేటకు, చిన సంపతిపురం నుంచి తమ్మయ్యపేట రోడ్డుకు, దిబ్బపాలెం నుంచి బవులవాడకు, కేబీ రోడ్డు నుంచి వేటజంగాలపాలేనికి, జగన్నాథపురం నుంచి సాకిపల్లికి రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించారని తెలిపారు. ప్రధాన రోడ్లన్నీ పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కొణతాల పనిచేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కర్రి సత్యనారాయణ, మామిడిపాలెం సర్పంచ్ పూడి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద స్థితిపై కేసు నమోదు



మృతుడు నారాయణరావు (ఫైల్)

కశింకోట, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి శివారులో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందడంతో కేసు నమోదు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు బుధవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలివి. కొత్తపల్లి గ్రామానికి చెందిన కుర్రు నారాయణరావు (55) గ్రామ సమీపంలో ఉన్నసిమెంటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. అయితే ఈ నెల ఎనిమిదో తేదీ మధ్యాహ్నం విధులకు హాజరై రాత్రి 10.30 గంటలకు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో గ్రామ శివారున గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించిన స్థానికుడు నారాయణరావు మనుమడు సుంకర ప్రసాద్‌కు సమాచారం అందించారు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరకుని 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ చెప్పారు. కాగా నారాయణరావు మృతిపై పలు అనుమానాలున్నాయని ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. మృతుడి భార్య సూర్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో అనకాపల్లి విద్యార్థికి కాంస్యం



లాస్యంత్‌ను అభినందిస్తున్న ప్రముఖుల

అనకాపల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన వీరమాచనేని శ్రీసూర్య లాస్యంత్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. నవంబరు ఒకటి నుంచి మూడో తేదీ వరకు కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపడంతో 63వ జాతీయ స్కేటింగ్ పోటీలకు అర్హత సాధించాడు. అనంతరం ఈ నెల ఐదో తేదీ నుంచి విశాఖలో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీల్లో చక్కగా రాణించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఈసందర్భంగా అతనితో పాటు కోచ్ పవన్‌కుమార్‌ను పలువురు అభినందించారు.

16 నుంచి జగన్నాథ ఆలయం చుట్టూ లక్ష ప్రదక్షిణలు

అనకాపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం అగ్గిమర్రిచెట్టు వద్ద గల సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి ఆలయం చుట్టూ ఈ నెల 16 నుంచి వచ్చే నెల 16 వరకు లక్ష ప్రదక్షిణల కార్యక్రమం చేపట్టనున్నామని ఆలయ చైర్మన్ దాడి బుజ్జి తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ బుధవారం ఆవిష్కరించారు. జగన్నాథస్వామి ఆలయ నిర్మాణం జరిగి 220 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చైర్మన్ తెలిపారు.

రైతు బజారు ఏర్పాటుకు ఆమ్ ఆద్మీ పార్టీ సంతకాల సేకరణ

అనకాపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చేయాలంటూ ఆమ్ ఆద్మీ ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరనాథబాబు నేతృత్వంలో గత 12 రోజులుగా ఇదే అంశంపై నెహ్రూచౌక్‌లో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సంగతి తెలిసింది. దీనిలో భాగంగా రైతు బజారు కోసం ప్రభుత్వాన్ని కోరుతూ సంతకాల సేకరణ నిర్వహించారు.

ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు

అనకాపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రింగురోడ్డులో ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు బుధవారం చేపట్టారు. జీవీఎంసీ ఉద్యానవన విభాగం ఏఈ ప్రియాంక ఆధ్వర్యంలో కార్మికులు రోడ్డుకి ఇరువైపులా, డివైడర్ల పైన ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

సీఐటీయూ మహా సభలపై విస్తృత ప్రచారం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలంటూ పట్టణంలోని బుధవారం ఆ యూనియన్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్ ఆధ్వర్యంలో పలువురి ఇళ్లు, దుకాణాల వద్దకు వెళ్లి సభలకు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాళ్ల తేలయ్యబాబు, ఉమామహేశ్వరరావు, అల్లు రాజు, గండి నాయనబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సబ్బవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవ సర్వే నెంబరు 121, 113 ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు బుధవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వెదళ్లనరవలో విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్న సమాచారం మేరకు తహశీల్దార్ చిన్నికృష్ణ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య, వీఆర్వో రాంబాబు ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

'కాలానుగుణంగా నైపుణ్యం మెరుగు పరుచుకోవాలి'

అనకాపల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్ సైన్స్ విభాగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని ఏయూ ప్రొఫెసర్ ఎం.శశి పేర్కొన్నారు. ఏయూ శత దినోత్సవ వేడుకల్లో భాగంగా దాడి వీరునాయుడు కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్ ప్రోగ్రామ్ బుధవారం ముగిసిన సందర్భంగా ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్, మిషన్ లెర్నింగ్ వంటి కోర్సుల్లో నైపుణ్యం సంపాదించి తద్వారా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అన్ని రకాల కోర్సులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందుకోసమే ఏయూతో కలిసి అనకాపల్లి జిల్లాలోని విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల అధ్యాపకులకు అధునాతన అంశాలుపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్ పాల్గొన్నారు.

డిజిటల్ ఎడ్యుకేషన్‌పై విద్యార్థులు చైతన్యవంతం కావాలి

» కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ శర్మ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ భారతి, వేదికపై శర్మవీఎస్ వేలూరి

చింతపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డిజిటల్ ఎడ్యుకేషన్‌పై చైతన్యవంతులు కావాలని వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ శర్మ వీఎస్ వేలూరి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి అధ్యక్షతన పీఎం ఉషా పథకంలో భాగంగా 'డిజిటల్ ఎడ్యుకేషన్, పాలసీ ఇంప్లికేషన్ ఇన్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ, ప్రాస్పెక్ట్ ఛాలెంజెస్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ ప్రారంభమైంది. తొలిరోజు డిజిటల్ ఎడ్యుకేషన్ సెమినార్‌కి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ప్రొఫెసర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చి, విద్యా వ్యవస్థలోనూ పెను మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. విద్య ప్రస్తుతం డిజిటలైజేషన్ రూపంలో అందుబాటులో ఉందన్నారు. విద్యార్థులు డిజిటల్ విద్యను అందిపుచ్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. అలాగే రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించిన నందికొట్కూరు ప్రభుత్వం డిగ్రీ కళాశాల కామర్స్ లెక్చరర్ డాక్టర్ పరిమళ, కర్నూల్ కేవీఆర్ డిగ్రీ కళాశాల గణితం లెక్చరర్ డాక్టర్ టి. సునీత డిజిటల్ విద్యపై పలు అంశాలను బోధించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వక్తలు పూలమాలలువేసి నివాళి అర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన తోలుబొమ్మలాట, థింసా నృత్యం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మినిముల శ్రీనివాస్ పాత్రుడు, పీఎం ఉష కో-ఆర్డినేటర్ డాక్టర్ వి. రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాచ్‌ఖండ్‌లో 100 శాతం విద్యుత్ ఉత్పాదన

ముంచంగిపుట్టు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా- ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుతు ఉత్పాదన శత శాతం జరుగుతోంది. ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేసే సామర్థ్యం ఈ ప్రాజెక్టు ఉంది. అయితే, విద్యుత్ ఉత్పాదనకు వినియోగించే 2వ నంబరు జనరేటర్ గత కొంత కాలంగా మూలకు చేరింది. దీంతో విద్యుత్ ఉత్పాదన ఆశించిన స్థాయిలో జరగడంలేదు. అయితే, సుమారు రూ.49 లక్షలతో జనరేటర్ మరమ్మతులు చేపట్టారు. ఇది వినియోగంలోకి రావడంతో మొత్తం ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేస్తున్నారు. శత శాతం విద్యుత్ ఉత్పాదనకు కృషి చేసిన ప్రాజెక్టు ఎస్ఈ ఏవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఇంజనీర్లు, సిబ్బందిని ఏపీజెన్‌కో డైరెక్టర్ హైడల్ సుజయ్ కుమార్ ఫోన్‌లో అభినందనలు తెలిపారు.

ప్రతీ నీటి బొట్టునూ పొదుపు చేద్దాం

» వాటర్‌షెడ్ మహోత్సవంలో టీడీపీ ఇన్‌చార్జి ఈశ్వరి



వాటర్‌షెడ్‌ల శిలాఫలకం ఆవిష్కరించిన గిడ్డి ఈశ్వరి, తదితరులు

కొయ్యూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల భవిష్యత్తు అవసరాలకు ప్రతి నీటిబొట్టును పొదుపుచేయాల్సిన ఆవశ్యకత ఉందని టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. బుధవారం మండలంలో వాటర్ షెడ్ మహోత్సవంలో పాల్గొని ఈ పథకంలో ఇప్పటి వరకు రూ 3.76కోట్ల వ్యయంతో నిర్మించిన 158 వాటర్ షెడ్ పనులను ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మంప పంచాయతీ నగరం సమీపంలో చేసిన మినీ ట్యాంకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు సాగునీటి భద్రత కోసం కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలతో భూగర్భ జలాల నిల్వలు పెంపునకు కేంద్రం సాయంతో వాటర్ షెడ్ పథకాలు నిర్మిస్తోందన్నారు. మొదటి విడతలో ఐదు పంచాయతీలకు వర్తింప చేశామన్నారు. రెండో విడతలో రానున్న ఏప్రిల్ నుంచి మిగిలిన పంచాయతీలకు విస్తరింప జేస్తామన్నారు. వర్షాకాలంలో నీటిని నీటిని ఎలా కాపాడుకోవాలి, ఎలా సద్వినియోగ పర్చుకోవాలి అన్న అంశాలను పరిశీలించి వాటర్‌షెడ్ పథకం ఉద్దేశమన్నారు. మూడో విడత లో రూ. 100 కోట్లు ఈ పథకం ద్వారా వెచ్చించేందుకు కార్యాచరణ రూపొందించినట్టు చెప్పారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆర్థికాభివృద్ధికి వాణిజ్య పంటలను సాగు చేయాలన్నారు. చిరుధాన్యాల సేంద్రియసాగుకు ప్రాధాన్యమిస్తోందన్నారు. గిరిజన రైతుల కోసం కోట్లాది రూపాయల వ్యయంతో అగ్రిటెక్‌పార్కు నిర్మాణాలకు చొరవ చూపినట్టు చెప్పారు. ఇందులో భాగంగా రెండో విడతలో మండలంలో పథకం ద్వారా చేపట్టిన కార్యక్రమ వివరాలను పథకం పీవో శంకరరావు ఈశ్వరికి వివరించారు. త్వరలో మూడో విడతకు చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలతో పంపిన ప్రతిని ఏపీడీ సీతయ్యనాయుడు ఆమెకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదరావు, ఉపాధి పథకం ఏపీవో అప్పలరాజు, వాటర్‌షెడ్ సిబ్బంది, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోవిందు మాస్టారు నేతలు కాకురు చంద్రరావు, తోట దొరబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీరామూర్తి, మహిళనేతలు సత్యవతి, రాజేశ్వరి కిత్తలోవ లక్ష్మి, సాంబశివరావు, మేడిబోయిన సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ



పాడేరురూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వాహనచోదకులకు ప్రత్యేక న్యాయపరిష్కారానికి వీలుగా ఈ నెల 13వ తేదీ శనివారం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లను జ్యూడిషియల్ ఫస్ట్ క్లాసు మేజిస్ట్రేట్ కోర్టులు.. పాడేరు, చింతపల్లి, అరకు, నర్సీపట్నంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. వీటి ద్వారా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలానా కేసులు ప్రత్యేకంగా పరిష్కరించుకోవచ్చన్నారు. వేగవంతమైన, సులభమైన న్యాయ పరిష్కారం పొందవచ్చన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాని ఆయన కోరారు.

ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ



అధికారికి సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ మండలాల పరిధిలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.జీవనకృష్ణ, కె.కార్తీక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తలారిసింగి నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ప్రధాన గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలలో గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాల వసతి గృహల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలని, వసతి గృహాల్లో వర్కర్లను పూర్తి స్థాయిలో నియమించాలని, శిథిలావస్థకు చేరిన వసతి గృహభవనాల స్థానంలో కొత్త వాటిని నిర్మించాలని, విద్యార్థులకు చలి నుంచి రక్షణ పొందేందుకు స్వెటర్లు సరఫరా చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ప్రమోట్ ఫీజు, ట్యూషన్ ఫీజు రద్దు చే యాలని, ప్రైవేటు కళాశాలల అధ్యాపకులకు ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం టీడబ్ల్యూ డీడీ కార్యాలయ అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చిన్నారావు, సింహాద్రి, పాపారావు, గోపాల్, చందు, అనీల్ పాల్గొన్నారు.


జాతిని మేల్కొల్పిన గేయం 'వందేమాతరం'



బూసుకొండలో జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సీలేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ బూసుకొండలో సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలైన సందర్భంగా బుధవారం ప్రచారం చేశారు. బకించంద్ర చటర్జీ రాసిన ఈ గేయం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ వారిని ఏ విధంగా గడగడలాడించిందో వివరించారు. ఈ గేయం గొప్పతనాన్ని తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఏ కార్యక్రమం తలపెట్టినా పాఠశాలలనుంచి చట్ట సభల వరకు ముందుగా వందేమాతరం గీతాన్ని ఆలపిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ పతాకాలతో వందేమాతరం.. జై భారత్ మాతాకి జై అంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్స్ వి శంకరరావు, ఎస్ఎన్ఎస్ పీఓ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.


జాతీయ స్థాయి క్రీడా పోటీలకు 17 మంది ఎంపిక



పోటీలకు ఎంపికైన వారితో క్రీడాభివృద్ధి అధికారులు

పాడేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జాతీయ పెసా మహోత్సవంలో భాగంగా ఈ నెల 23, 24 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు జిల్లా నుంచి 17 మంది క్రీడాకారులు ఎంపికైనట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్ మోహనరావు బుధవారం తెలిపారు. ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన పి.శివాజీ, డి.ఆనందరాజు, పి.నీలవేణి, ఎస్.మంజుల, ఎల్.జ్యోతి, ఎం.కార్తిక్, జి.లోకనాథ్, పి.హెజ్కియా, యు.అనిల్, కె.గణేశ్, కె.చందుబాబు, పి.మల్లికార్జున్, ఎస్.మంజుల, కె.అనిత, పి.నీలవేణి, పి.జ్యోతి, కె.రూస్నీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఎంపికకావడంపై కలెక్టర్ దినేశ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

ఐరన్ మెస్, వాటర్ ఫిల్టర్ వితరణ



గుడివాడ సబ్‌సెంటర్‌కు ఐరన్ మెస్, వాటర్ ఫిల్టర్స్ అందిస్తున్న టీడీపీనేత సుబ్బారావు

పాడేరురూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాడేరు మేజర్ పంచాయతీలోని గుడివాడ గ్రామ సచివాలయ పరిధిలోని హెల్త్ సబ్ సెంటర్ చుట్టూఫెన్సింగ్‌కు సరిపడే విధంగా ఐరన్ మెస్‌లతో పాటు వాటర్ ఫిల్టర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రహరీ లేక వైద్య సిబ్బంది పడుతున్న ఇబ్బందులను గుర్తించి వీటిని సమకూర్చినట్టు చెప్పారు. సబ్ సెంటర్ ఏఎన్ఎం సువర్ణ, మహేశ్వరి, ఆశ కార్యకర్తలు సరస్వతి, దానమ్మ, కొండమ్మ, టీడీపీ నాయకులు, పంచాయతీ ఉపసర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, ప్రశాంత్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే స్థానిక సంస్థల్లో విజయం

» టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

కొయ్యూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని ఆ పార్టీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రరావు, దొరబాబుల ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో పార్టీ విజయ కేతనం ఎగుర వేసేందుకు ఇప్పటినుంచే ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రజాభిప్రాయం మేరకు సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో మన ప్రభుత్వం ఉన్నా స్థానికంగా బలం లేకుండా ఉన్నామన్నారు. ఈ పరిస్థితిని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. వర్గ విభేదాలకు దూరంగా అంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఇందుకు ప్రతీ రెండు వారాలకోసారి మండల పర్యటన చేసి క్లస్టరు వారీగా సమావేశాలు నిర్వహిస్తానన్నారు. అనంతరం వివాదంతో నిలిచిన కాకరపాడు వినాయక ఆలయ స్థలాన్ని పరిశీలించారు. గుడి నిర్మాణాలకు సత్వర చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోవిందు మాస్టారుతోపాటు మండలంలోని 33 పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులకు టెట్ వద్దు'



ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయించాలని కోరుతూ నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో బుధవారం పాడేరులో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు మాట్లాడుతూ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇ వ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో వెంటనే రివ్యూ పిటీషన్ వేయాలని కోరారు. పార్లమెంట్‌లో ఆర్‌టీఈ యాక్ట్ సెక్షన్ 23(1)ను సవరించి 2వ శనివారం, ఆదివారం ఉపాధ్యాయులకు ప్రత్యేక తరగతులు నిర్వహించకుండా చూడాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ నాయకులు టి.చిట్టిబాబు, ఎం.ధర్మారావు, పి.దేముడు, ఎస్.కన్నయ్య, డివిజన్‌లోని 11 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాల సభ్యులకు శిక్షణ



విజన్‌బిల్డింగ్‌పై శిక్షణలో మాట్లాడుతున్న డీపీఎం కనకారావు

అరకులోయ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అరకులోయను మోడల్ మండలంగా ఎంపిక చేసినందున విజన్ బిల్డింగ్‌పై తొలిసారిగా శిక్షణ తరగతులు వెలుగు అధికారులు ఏర్పాటు చేశారు. ఏపీఎం కృష్ణారావు ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 48 గ్రామ సంఘాల నుంచి ఇద్దరు చొప్పున సభ్యులకు నాలుగురోజులపాటు విజన్ బిల్డింగ్‌పై శిక్షణను ఇస్తున్నారు. రెండవ రోజైన బుధవారం పాడేరు నుంచి డీపీఎం (జిల్లా ప్రాజెక్టు మేనేజర్) కనకారావు, డిలైలియాడ్ మేనేజర్ ప్రభాకరరావు పాల్గొని మాట్లాడారు. స్వయంసహాయక సంఘాలన్నీ ఆర్థిక స్వయం స్వావలంబన బాటలో కొనసాగేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు శిక్షణలో నేర్చిన అంశాలను అమలు చేయాలని కోరారు. మండలంలో మిగిలిన 1236 స్వయం సహాయక సంఘాల సభ్యులకు విడతల వారీగా శిక్షణ అందిస్తామన్నారు. 48 సంఘాల ప్రతినిధులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా పదో తరగతి పరీక్షలపై వందరోజుల కార్యాచరణ: డిప్యూటీ డీఈవో



చిన్నారులతో పాఠ్యపుస్తకాన్ని చదివిస్తున్న డిప్యూటీ డీఈవో చెల్లయ్య

అనంతగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించేందుకు డిప్యూటీ డీఈవో ఎస్.చెల్లయ్య బుధవారం మండలంలో పర్యటించారు. ముందుగా స్థానిక బాలికల-2 పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. వారికి పలు ప్రశ్నలు వేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి వందరోజుల కార్యచరణ పటిష్టంగా అమలుచేయాలని ఆదేశించారు జీఎఫ్ఎల్ఎన్, తరల్ అమలులో నిర్లక్ష్యం వద్దని సూచించారు. నూతనంగా ఉపాధ్యాయవృత్తిలో చే రిన వారికి తరల్, జీఎఫ్ఎల్ఎన్‌పై అవగాహనలో భాగంగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఎంఈవో లుకిల్లో బాలాజీ, బీబీ.నాగేశ్వరరావు, హెచ్ఎం మంగమ్మ, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, రాంబాబు, మంజునాథ్, సన్యాసిరావు, పాల్గొన్నారు.

టీడబ్ల్యూ ప్రధానకార్యదర్శి దృష్టికి టీచర్ల సమస్యలు

పాడేరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆశాఖ ప్రధాన కార్యదర్శి ఎం.ఎం. నాయిక్ దృష్టికి తీసుకువెళ్లినట్టు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.చిట్టిబాబు, కె.రాంబాబు బుధవారం విలేకరులకు తెలిపారు. ముఖ్యంగా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వంట కార్మికులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని పాఠశాలల్లో 650 మంది ఉన్న విద్యార్థులకు కేవలం 9 మంది కార్మికులున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిపాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య రక్షణకు హెల్త్ వర్కర్లను, నైట్ వాచ్‌మన్‌లను నియమించాలని, టీచర్ల నివాస గృహాలు నిర్మించాలని, టీచర్లకు రాత్రి బసను మినహాయించాలని, గ్రేడ్- 2 పండితులు, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, ఆశ్రమ పాఠశాలలో టీచర్లకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని ప్రధాన కార్యదర్శి వినతిపత్రం సమర్పించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి :ఎస్ఐ



వాహనచోదకులతో మాట్లాడుతున్న ఎస్ఐ సురేశ్ కుమార్

గూడెంకొత్తవీధి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్ఐ సురేశ్‌కుమార్ అన్నారు. బుధవారం రింతాడ జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా వాహన చోదకులతో మాట్లాడుతూ రికార్డులు లేని వాహనాలను నడపరాదన్నారు. వాహనాలకు ఇన్సూరెన్సు, సీ బుక్, రోడ్ ట్యాక్స్ ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగంగా వాహనాలను నడపరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

బాల్య వివాహాల రహిత సమాజమే లక్ష్యం



ర్యాలీ చేపడుతున్న ఐసీడీఎస్ పీవో, విద్యార్థులు

ముంచంగిపుట్టు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు లేని సమాజమే లక్ష్యంగా గ్రామాల్లో చైతన్య పరచాలని సీడీపీవో విమల కుమారి అన్నారు. స్థానిక కళాశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై 100రోజుల జాతీయ కార్యక్రమం ఐసీడీఎస్ ఆ ధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలపై నియంత్రించేందుకు కఠినమైన నిబంధనలు అమలులో ఉన్నాయని తెలిపారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొండన్నదొర, వెలుగు ఏపీఎం కళావతి, సీనియర్ అసిస్టెంట్ మట్టయ్య, సూపర్‌వైజర్లు రాజేశ్వరి, వరహాలమ్మ, అధ్యాపకులు వేణుగోపాల్, దామోదరం, లక్ష్మణ్‌కుమార్, నూకరాజు, కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ స్థలాలకు పరిశీలన



గూడెంలో గిరిజనులతో మాట్లాడుతున్న తహశీల్దార్ వీరభద్రచారి

అనంతగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ గూడెంలోని 17 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి సంబంధించి స్థలాల కోసం సర్వేకు బుధవారం తహశీల్దార్ వీరభద్రచారి, స్థానిక సర్పంచ్ చిరంజీవితో కలిసి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌కు గిరిజనులు తమ సమస్యలను వివరించారు. పోడు భూములకు పట్టాలివ్వాలని కోరారు. ఇళ్లకు దరఖాస్తులు చేసుకోవాలని తహశీల్దార్ సూచించారు.

టీడీపీ పరిశీలకుడు క్షేత్రస్థాయి పర్యటన

పెదబయలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు పెదబయలు, ముంచంగిపుట్టు బూత్ ఎన్నికల పరిశీలకుడు కోడా వెంకట సురేశ్‌కుమార్ తెలిపారు.మండలంలోని పర్రెడా, పెద్దాపుట్టుల్లోని బూత్‌లను పరిశీలించారు. గత ఎన్నికల్లో టీడీపీకి తక్కువగా పోలైన ఓట్ల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పర్రేడా పంచాయితీలో 51,52 బూత్‌లను తనిఖీ చేసి వివరాలను సమీకరించారు. స్థానికులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంతేలి వెంకటప్రసాద్, మూర్తిబాబు , బూత్ ఇంచార్జీలు మల్లేశ్వరరావు, అప్పన్న, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



కరకవలసలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న వాకర్స్ ప్రతినిధి ప్రభాకరరావు , గిరిజన సంఘం నేతలు

అరకులోయ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని సీతమ్మధారకు చెందిన అల్లూరి వాకర్స్ అసోసియేషన్ వారు స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం నేతలతో కలిసి గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేపట్టారు. బుధవారం బొండాం పంచాయతీ పరిధిలోని కరకవలస, బలియగుడ గ్రామాల్లో వాకర్స్ ప్రతినిధులు ప్రభాకరరావు, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఆధర్యంలో 100 మందికి దుప్పట్లు అందజేశారు. దుప్పట్లు అందజేయడంపై గిరిజన సంఘం నాయకులు బుజ్జిబాబు, కె.రామారావు, జ్యోషి, వెంకట్ ధన్యవాదాలు తెలిపారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారంచేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

డుంబ్రిగుడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, ఎన్నికల అధికారి మహేశ్వరరావు, పరిశీలకులు జిల్లా కార్యదర్శి కన్నయ్య సమక్షంలో మండల కౌన్సిల్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా చెడ్డ జయరాం, అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కాకర రాజారావు, ఇతర ప్రతినిధులను సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన సంతాపం తెలిపారు.

అనారోగ్యంతో చిన్నగెడ్డ పాఠశాల పీఎస్‌హెచ్ఎం మృతి



వెంకటరమణ (ఫైల్)

చింతపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చి న్నగెడ్డ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పీఎస్ హెచ్ఎం పల్లి వెంకట రమణ (56) అనారోగ్యంతో మృతి చెందారు. కొయ్యూరు మండలం చిట్టింపాడు పంచాయతీ రామన్న పాలెంనకు చెందిన వెంకటరమణ చిన్నగెడ్డపాఠశాలలో మూడేళ్లగా పీఎస్‌హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంగళవారం రాత్రి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి స్థానిక ఎంఈవోలు పీబీవీవీ ప్రసాద్, గెమ్మెలి బోడం నాయుడు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న నాయకులు

జి.మాడుగుల, డిసెంబరు 10 (ఆంధ్రజోతి) : మండలంలోని సొలభం పంచాయతీ వంజంగిపాడులో సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం సర్పంచ్ హనుమంతరావు, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు ఉపద్యక్షుడు లకే రామకృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ రూ. 20లక్షల వ్యయంతో ఉపాధి నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టానున్నట్టు తెలిపారు. మాజీ ఎంపీపీ వెంకట గంగరాజు, టీడీపీ నాయకులు రామరాజు, బాలయ్యదొర, మత్యకొండబాబు, అబ్బాయిదొర, మురళీదొర, తెల్లన్నదొర, పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీర్ ఏఈ మాణిక్యం పాల్గొన్నారు.

లోయలోకి ఆటో.. తప్పిన ప్రమాదం



బోడగుడ సమీపాన లోయలోకి దూసుకుపోయిన ఆటో

అనంతగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకు - విశాఖ ప్రధాన రహదారి బోడగుడ సమీపంలో ఆటో లోయలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలివి.. బుధవారం మధ్యాహ్నం ప్రయాణికులతో వెళుతున్న ఆటో బ్రేక్‌ఫెయిలై బోడగుడ సమీపంలో లోయలోకి దూసుకు పోయింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదంజరగకపోవడం స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరత

ఎనిమిది వీఆర్వో పోస్టుల ఖాళీ

భర్తీకాని రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్

సీనియర్ అసిస్టెంట్, టైపిస్టు పోస్టులు

సకాలంలో పూర్తికాని పనులు...

రైతులు, ప్రజల అగచాట్లు





సిబ్బంది కొరత ఉన్న తహశీల్దార్ కార్యాలయం ఇదే.. పోస్టు భర్తీ చేయకపోవడంతో ఖాళీగా ఉన్న రీ సర్వే డీటీ కుర్చీ

నాతవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండల రెవెన్యూ కార్యాలయాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. ఏడాదిన్నరగా తగిన సిబ్బంది లేకపోవడంతో సకాలంలో పనులు పూర్తి కావడం లేదు. అలాగే రెవెన్యూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మండలంలోని 39 రెవెన్యూ గ్రామాలకు 18 మంది వీఆర్వో ఉండాల్సి ఉంది. ప్రస్తుతం పది మంది వీఆర్వోలు మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా ఎనిమిది వీఆర్వో పోస్టులను ఏడాదిన్నరగా భర్తీ చేయడంతో దీంతో ఒక్కొక్క వీఆర్వోలకు రెండేసి రెవెన్యూ గ్రామాలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఫలితంగా వారు ప్రజలకు సరిగా అందుబాటులో ఉండడం లేదు. వీఆర్వోలకు పని ఒత్తిడి ఎక్కువ కావడంతో ప్రజలకు సకాలంలో రెవెన్యూ సేవలు అందటం లేదు. పట్టాదారు పాసు పుస్తకాలు, విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందడం లేదు. అలాగే భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

జిల్లేడిపూడి, నాతవరం-1, వల్లంపేట, గుమ్మిడిగొండ, వైడిపేట-1, వైడిపేట-2, వెదురుపల్లి రెవెన్యూ గ్రామాలకు వీఆర్వోలు పోస్టులు ఏడాదిన్నరగా భర్తీ చేయకుండా అధికారులు తాత్సారం చేస్తుండడంతో తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అలాగే తహశీల్దార్ కార్యాలంలో సీనియర్ అసిస్టెంట్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, టైపిస్టు పోస్టులు భర్తీ చేయలేదని, స్పందనలో వచ్చే ఫిర్యాదులను కూడా పరిష్కరించడంలో జాప్యం జరుగుతుందని మండల ప్రజలు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి తహశీల్దార్ కార్యాలయంలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని వారు కోరుతున్నారు.

జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ మీట్‌లో దివ్యాంగుల సత్తా



క్రీడా పోటీల్లో సత్తాచాటిన దివ్యాంగ విద్యార్థులకు పతకాలు అందిస్తున్న డీఈవో

రావికమతం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ మీట్‌లో మండలానికి చెందిన దివ్యాంగ విద్యార్థులు సత్తా చాటారు. అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో ఈ నెల 9న నిర్వహించిన పారా స్పోర్ట్స్ మీట్‌లో మండలానికి చెందిన 22 మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో మేడివాడ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జి.బాబూరావు (శారీరక వైకల్యం) బాలుర విభాగంలో వంద మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చాటాడు. అలాగే జావెలిన్ త్రో పోటీలోనూ ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే గర్నికం కేజీబీవీ విద్యాలయానికి చెందిన రాజాన మానస, సుంకరి దివ్య మణికంఠ, చైతన్య, హేమదుర్గ వివిధ క్రీడల్లో సత్తా చాటి బంగారు, వెండి పతకాలు సాధించారు. కొత్తకోట జూనియర్ కళాశాలకు చెందిన కొట్యాడ రాము, జలుమూరు ధనలక్ష్మి, మల్లేటి ఆనంద్, వేపాడ దుర్గ వివిధ ఆటల పోటీల్లో పాల్గొని సత్తాచాటి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. మరుపాక ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన శారీరక దివ్యాంగ విద్యార్థి వీల్ చైర్‌కి సంబంధించిన పోటీలో పాల్గొని విజయం సాధించి బంగారం, వెండి పతకాలు సాధించాడు. క్రీడా పోటీల్లో సత్తాచాటి బంగారు, వెండి పతకాలను సాధించిన దివ్యాంగ విద్యార్థులను జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు, సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త బి.రామకృష్ణనాయుడు చేతుల మీదుగా బంగారు పతకాలను అందజేశారని ప్రత్యేక ఉపాధ్యాయులు బి.మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు తెలిపారు. అలాగే ఈ పోటీల్లో బంగారు పతకాలను సాధించిన దివ్యాంగ విద్యార్థులను ప్రత్యేక ఉపాధ్యాయులతో పాటు విద్యా శాఖ అధికారులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిలిపివేయండి

వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు



మండలాల వారీగా సేకరించిన సంతకాల బాక్సులను చూపుతున్న అమర్

చోడవరం/నర్సీపట్నం/దేవరాపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన ప్రజాభిప్రాయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్ డిమాండ్ చేశారు. చోడవరం, నర్సీపట్నం, మాడుగుల నియోజకవర్గ కేంద్రాల్లో బుధవారం మెడికల్ కాలేజీలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. చోడవరంలో అమర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాలుగు లక్షలకు పైగా ప్రజలు సంతకాలు సేకరించామన్నారు. చోడవనం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 52వేల మంది సంతకాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, నాయకులు దొండా నారాయణమూర్తి, బొడ్డేడ సూర్యనారాయణ, పల్లా నరసింగరావు, పుల్లేటి వెంకటేశ్, నెహ్రూ, డి.సత్య, జి.రాజు, కె.జగన్నాథరావు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. నాలుగు మండలాల నుంచి ఏభై వేలుకు పైగా సంతకాలు సేకరించి తారువ గ్రామంలో ఆ ప్రతులను ఊరేగించారు. దేవరాపల్లి, కెకోటపాడు ఎంపీపీలు చింతల బుల్లిరెడ్డి జగన్మోహన్, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, బూరే బాబూరావు, కేవీ.రమణ, నియోజక వర్గ నాయకులు పాల్గొన్నారు. నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కళాశాలలు పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేస్తున్నట్టు విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాలు సేకరణకు మంచి స్పందన వస్తున్నదన్నారు. నియోజకవర్గంలో 61 వేల సంతకాలు చేసిన పత్రాలను పార్టీ కార్యాలయానికి తరలించామని తెలిపారు.


టెట్ నుంచి మినహాయించాలని నిరసన



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని తహశీల్దార్ కార్యాయం వద్ద యూటీఎఫ్ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రభుత్వం సుప్రీం కోర్టులో వెంటనే రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, కార్యదర్శి చైతన్యశీల, సీనియర్ నాయకులు శరగడం జగ్గారావు, రామచంద్రరావు, కుదర కామరాజు, సత్తిబాబు, అప్పారావు, శాంతిదేవిప్రకాశ్, దేవుడు, జీవన్, ఉమామహేశ్ తదితరులు పాల్గొన్నారు.


చాకలిగెడ్డలో మొరాయించిన ఆర్టీసీ బస్సు



చాకలిగెడ్డ వద్ద నిలిచిన బస్సు

నాతవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాండవ-నాతవరం రూటులో బుధవారం చాకలిగెడ్డ వద్ద ఆర్టీసీ బస్సు మొరాయించింది. ఉదయం నర్సీపట్నం వస్తున్న ఈ బస్సు అకస్మాత్తుగా నిలిచిపోయి ఎంతకీ కదల్లేదు. దీంతో కళాశాలలకు వెళ్లేందుకు ఈ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులు సమయం దాటిపోవడంతో ఇంటి ముఖం పట్టారు. కాగా ఈ రూటులో కాలం చెల్లిన డొక్కు బస్సులు వేస్తున్నారని, తరచూ ఇటువంటి సమస్యలు ఎదురవుతున్నాయని ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బస్సులు మొరాయిస్తున్న రోజుల్లో తమ పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడుతుందని వాపోయారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తాండవ-నర్సీపట్నం రూటులో కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ప్రయాణికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ నాయకులు ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ నిబంధనలు సడలించి ధాన్యం మద్దతు ధరకు అదనంగా బోనస్ కలిపి కొనుగోలు చేయాలన్నారు. భూమి లేని కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకంతో పాటు బ్యాంకు రుణాలు, వ్యవసాయ, ఉద్యానవన పథకాలు అమలు చేయాలన్నారు. అనంతరం ఆర్డీవో వీవీ.రమణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాభవానీ, జగ్గారావు, గొల్లు గురుబాబు, గుడాల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలని మంత్రికి వినతి



ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన ఎమ్మెల్యే రాజు, నాయకులు

చోడవరం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రకు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయవాడలో మంత్రిని కలిసిన ఎమ్మెల్యే రాజు, రోడ్డు పనులు పూర్తితోపాటు నియోజకవర్గానికి అదనపు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు, పట్టణ టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, జనసేన నాయకులు సిరిపురపు రమేశ్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గూనూరు మూలినాయుడు, సీతాగణేశ్, బొబ్బిలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం బోర్డు సభ్యురాలు కృష్ణవేణికి అభినందన



కుమార్ దంపతులను సత్కరిస్తున్న కృష్ణవేణి

దేవరాపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కాణిపాకం గణపతి ఆలయం బోర్డు సభ్యుడిగా మండలంలోని రైవాడ మాజీ సర్పంచ్ చల్లా కృష్ణవేణి ఎంపిక కావడంతో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్ అభినందించారు. బుధవారం వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈపదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యే బండారు. సత్యనారాయణమూర్తి, ఎంపీ సీఎం రమేశ్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పీవీజీ కుమార్ దంపతును సత్కరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి భర్త చల్లా నానాజీ పాల్గొన్నారు.

నేవీ స్టోర్స్ హౌస్ ఏర్పాటుకు స్థల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న నేవీ కమాండర్లు

మాకవరపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి రెవెన్యూ ఎరకన్నపాలెం గ్రామంలో ఉన్న 150 ఎకరాల భూమిని నేవీ కమాండర్లు బుధవారం పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వం 410 ఎకరాల ప్రభుత్వ భూమిని తీసుకుంది. అనంతరం డోజ్కో కంపెనీ 150 ఎకరాల భూమిని తీసుకుని రూ.1234 కోట్లతో కంపెనీ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి అనుమతులు పొందింది. ఇందులో భాగంగానే బుధవారం నేవీ నుంచి మరో 150 ఎకరాలు తీసుకునేందుకు 737లో భూమిని పరిశీలించారు. ఇక్కడ నేవీ స్టోర్స్ హౌస్ ఏర్పాటు చేస్తున్నట్టు నేవీ కమాండర్లు శర్మ, రాజేశ్ తెలిపారు. అయితే ఇప్పటికే అచ్యుతాపురం, రాంబిల్లి, చోడవరంతో పలు గ్రామాల్లో స్థఆలను పరిశీలించినట్టు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసిన తర్వాత, వారి ఆదేశాల మేరకు స్థలాన్ని తీసుకుంటమాని వారు తెలిపారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

మాడుగుల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో గృహ నిర్మాణ శాఖ, సర్వశిక్ష అభియాన్ అధికారులతో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పి.అప్పలరాజు పాల్గొన్నారు.

యాదవ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రసాద్



మొల్లి ప్రసాద్

చోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యాదవ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలంలోని గంధవరం గ్రామానికి చెందిన మొల్లి ప్రసాద్ ఎన్నికయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు భరణికాన బాబూరావు ఆధ్వర్యంలో బుచ్చెయ్యపేటలో నిర్వహించిన సమావేశంలో ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈపీడీసీఎల్ వడ్డాది సెక్షన్ ఏఈ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఈ వెంకటరమణ

బుచ్చెయ్యపేట డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది ఏఈ ఈపీడీసీఎల్ సెక్షన్ ఏఈగా వెంకటరమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పాడేరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఏఈ సోమరాజు పాడేరు బదిలీ అయ్యారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి, కొత్త లైన్ల ఏర్పాటుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన ఈఈ వెంకటరమణ తెలిపారు.

నేడు హిందూ ధర్మ మహా సమ్మేళనం

నాతవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం హిందూ ధర్మ మహా సమ్మేళనం నిర్వహించనున్నట్టు హిందూ ధర్మ రక్షణ కమిటీ మండల అధ్యక్షుడు శెట్టి నానాజీ తెలిపారు. ముందుగా గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామాలయం నుంచి సింగంపల్లి వరకు శోభాయత్ర ఉంటుందని చెప్పారు. ఈ యాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చామంతిపురంలో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

మాకవరపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామంతిపురం గ్రామంలో ఉన్న కొండపోరంబోకు భూమిని స్వాధీనం చేసుకోవాలని మాజీ ఎంపీపీ సత్యనారాయణ, పలువురు సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ బి.వెంకటరమణకు బుధవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు-467లో సుమారు ఐదు ఎకరాల భూమిని కొందరు రైతులు ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూమిని స్వాధీనం చేసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చామంతిపురం, తూటిపాల, పెద్దిపాలెం, మామిడిపాలెం గ్రామాల నాయకులు గోవింద, ప్రసాద్, రమణ, బాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

రోలుగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి కోరారు. రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహల వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడతారన్నారు. సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త రూప, హెచ్‌ఎం శేషగిరిరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

దేవరాపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అలమండ, చిన సోంపురం పాఠశాలల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా బుధవారం ప్రతిజ్ఞ చేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను సెక్టార్ పర్యవేక్షకులు జి.ఆదిలక్ష్మి వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

నేడు కంటి వైద్య శిబిరం

దేవరాపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపెంట పుల్లూరు నారాయణస్వామి ఆశ్రమంలో గురువారం నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తామని వాసవీ క్లబ్ సభ్యులు తెలిపారు. కంటి పరీక్షలు చేసిన అనంతరం అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. అలాగే చకంటి అద్దాలు, మందులు అందిస్తామని వారు తెలిపారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

మాకవరపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూటిపాల, బూరుగుపాలెం తదితర గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి అప్పారావు మాట్లాడుతూ పర్యావర్యాణాన్ని పరిరక్షిస్తూ నేల సారాన్ని కాపాడాలని చెప్పారు. ఇందు కోసం రైతులు పంట వ్యర్థాలను భూమిలో కలిపి దున్నాలని సూచించారు. పంట వ్యర్థాలు భూమికి సహజ పోషకాలు అందిస్తాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

రావికమతం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో కోతుల దాడిని నివారించి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు కోరారు. ఈ మేరకు బుధవారం తహశీల్దార్ అంబేడ్కర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ఇటీవల ఇద్దరు విద్యార్థినులను కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరడంతో వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. కోతుల భయంతో పలువురు విద్యార్థినులు హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్లిపోయారని చెప్పారు. వసతి గృహంలో అడవిని తలపించే విధంగా వివిధ రకాల చెట్లు ఉండడంతో కోతులు స్థావరంగా ఏర్పాటు చేసుకున్నాయని, హాస్టల్ నుంచి బయటకు వచ్చే విద్యార్థినులపై దాడులు చేస్తున్నాయని చెప్పారు. ఇంత జరుగుతున్నా సాంఘిక సంక్షేమ శాఖాధికారులు ఈ వసతి గృహన్ని సందర్శించకపోవడం దారుణమని ఆయన పేర్కొన్నారు. కోతలు నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు విద్యార్థినుల వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని కోరారు.

వీధి కుక్కలకు ర్యాబిస్ టీకాలు

మాడుగుల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వీధి కుక్కలకు బుధవారం ర్యాబిస్ వ్యాధి నివారణ టీకాలను వేశారు. 'వీధి కుక్కల స్వైర వీహారం... పలువురికి గాయాలు' అని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు వీధి కుక్కలకు ర్యాబిస వ్యాధి నిరోధక టీకాలు వేయాలని పశు సంవర్థక శాఖను ఆదేశించారు. దీంతో ఆ శాఖ అధికారి రామ్మోహన్‌రావు మాడుగుల గ్రామాన్ని బుధవారం సందర్శించి విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలకు సిబ్బందితో పట్టించి టీకాలు వేయించారు. మాడుగుల ఏరియా పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ వి.చిట్టినాయుడు గ్రామంలో ఉన్న వీధి కుక్కలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 కుక్కలకు టీకాలు వేసినట్టు డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యదర్శులంతా తమ పంచాయతీ పరిధిలోని వీధి కుక్కలను పట్టుకొనేందుకు సిబ్బందిని ఏర్పాటు చేస్తే టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. అనంతరం సీహెచ్‌సీని జిల్లా అధివారి రామ్మోహన్‌రావు సందర్శించి కుక్కకాటుకు గురైనవారి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కింతలి పశు వైద్యాధికారి కె.శివకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

మాడుగుల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాడుగుల కోర్టు ఆవరణలో ఈ నెల 13న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాడుగుల జూనియర్ సివిల్ జడ్జి ఎన్.లావణ్య సూచించారు. బుధవారం మాడుగుల కోర్టు ప్రాంగాణంలో న్యాయవాదులకు, పోలీసులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ అదాలత్ ద్వారా కేసులు రాజీకి వచ్చేలా, పెండింగ్ కేసులు సత్వర పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ పెండింగ్ కేసుల విషయంపై చర్చించి, హైకోర్టు తీర్పు మేరకు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలి సూచించారు. న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

దిబ్బిడిలో కాలువల పరిశీలన

బుచ్చెయ్యపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో దిబ్బిడి గ్రామంలో కాలువలను బుధవారం ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీడీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాజిక్ డ్రైన్ వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగాలు ఉంటాయని చెప్పారు. ఈ కాలువల నిర్మాణం వల్ల ప్రజలు వినియోగించిన నీరు భూముల్లో ఇంకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వరహాలుబాబు, ఈసీ సంతోశ్, టెక్నికల్ అసిస్టెంట్ మోదకొండ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తుకు బానిసలు కావద్దు

చీడికాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తుకు విద్యార్థులు బానిసలు కావద్దని ఎస్ఐ బి.సతీశ్ కోరారు. చీడికాడ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా మంచాల మోడల్ స్కూల్‌లో బుధవారం మధ్యాహ్నం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి పండించడం, రవాణా చేయడం నేరమన్నారు. ఈ కేసుల్లో ప్రమేయం ఉంటే 20 ఏళ్ల కఠిన శిక్ష పడుతుందన్నారు. గంజాయి రహిత సమాజం నిర్మించుకోవడానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ సదస్సులో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దేరు జలాశయం నుంచి 300 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా ఉంది. ఇటీవల సాధారణ, తుఫాన్ వర్షాలకు ఉధృతంగా వరద నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. దీంతో జలాశయంలో నీటి నిల్వలు పుష్కలంగా పెరిగాయి. నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరంది.

ఈ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, బుధవారం సాయంత్రానికి 136.40 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో 125 క్యూసెక్కులు నమోదైందని, రాత్రి తొమ్మిది గంటలు దాటిన తరువాత జలాశయం మూడో గేటు తెరిచి 300 క్యూసెక్కుల నీటిని నదీ ప్రవాహంలోకి విడిచిపెట్టామని జలాశయం ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నాకు తరలిరండి

చోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా నేత గూనూరు వరలక్ష్మి తెలిపారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనపై కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకులు కొండమ్మ, మహాలక్ష్మి, రంగలక్ష్మి, వరలక్ష్మి, రమణమ్మ, అలివేలు మంగ పాల్గొన్నారు.

నేడు మంత్రి లోకేశ్ రాక

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం రాత్రి నగరానికి రానున్నారు. రాత్రి తొమ్మిది గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి పార్టీ కార్యాలయానికి వెళ్లి బస చేస్తారు. ఈనెల 12వ తేదీన రుషికొండ ఐటీ హిల్స్‌పై ఆరు సంస్థలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కాపులుప్పాడలో కాగ్నిజెంట్ కంపెనీ భూమి పూజ కార్యక్రమానికి హాజరవుతారు.

విద్యార్థుల ఆచూకీ లభ్యం

రాంబిల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం బీసీటీ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి అదృశ్యమైన ఆరుగురు విద్యార్థులను బుధవారం పోలీసులు పట్టుకుని వారి తల్లిదండ్రులకుఅప్పగించారు. పదవ తరగతి చదువుతున్న డి.జశ్వంత్, ఎం.హిమతేజ, ఎస్.భరత్, బి.లక్ష్మణరావు, పి.వరుణ్, యు.రాజారావులు మంగళవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి అదృశ్యమైన సంగతి తెలిసిందే. పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్పీ తుహిన్ సిన్హా మూడు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసులు 24 గంటలు గడవక ముందే బుధవారం ఉదయం 8 గంటల సమయంలో అనకాపల్లిలోని ఎన్‌టీఆర్ స్టేడియం వద్ద ఆ విద్యార్థులను పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, రాంబిల్లి సీఐ నర్సింగరావు ఆ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి స్కూల్ యాజమాన్యం సమక్షంలో వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఇద్దరు రేషన్ డీలర్లపై కేసులు నమోదు



రేషన్ డిపోలో తూనిక యంత్రాన్ని తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

పాయకరావుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పట్టణంలోని రేషన్ డిపోల్లో బుధవారం తనిఖీలు చేసిన లీగల్ మెట్రాలజీ అధికారులు రెండు రేషన్ డిపోల్లో తేడాలు గుర్తించి ఇద్దరు రేషన్ డీలర్లపై కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించి నర్సీపట్నం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనురాధ వివరాలు అందజేస్తూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా బుధవారం పాయకరావుపేటలోని రేషన్ డిపోల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో మంగవరంరోడ్డు, లింగాలతోటకాలనీలోని రేషన్ డీలర్లు ప్రభుత్వం పంపిణీ చేసిన ఈ-పోస్‌తో అనుసంధానం చేసిన తూనిక యంత్రానికి బదులుగా అనధికార తూనిక యంత్రాలను వినియోగించి పీడీఎస్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్టు గుర్తించి ఆయా రేషన్ డీలర్లపై కేసులు నమోదు చేశామని ఆమె తెలిపారు.

విశాఖతో అనుబంధం



నటనలో ఇక్కడే శిక్షణ తీసుకున్నా
తొలి చిత్రానికి ముగ్గురు అగ్ర హీరోల ఆశీస్సులు

- తాత, తండ్రి పేరును చెడగొట్టను
- నటుడు కాకుంటే క్రికెటర్ అయ్యేవాడిని
- హీరో ప్రభాస్‌తోనే శంబాల చిత్రానికి క్రేజ్
- వర్ధమాన హీరో ఆది సాయికుమార్

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : **ప్రేమకావాలి అంటూ...తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరుస్థానం సంపాదించి, లవ్‌లీ...శశి...అంటూ లవర్‌బాయ్‌గా అలరిస్తూనే...యాక్షన్, థ్రిలర్ జోన్స్ ద్వారా ఆకట్టుకుంటున్నారు హీరో ఆది సాయికుమార్. తాత ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టు పీజే శర్మ, ప్రముఖ హీరో, క్యారెక్టర్ ఆర్టిస్టు సాయికుమార్ కుమారుడిగా చిత్రరంగంలో దనదైన శైలిలో కొనసాగుతున్నారు. ఇటీవల తన జోనర్స్‌కు పూర్తి భిన్నంగా 'శంబాల' చిత్రంలో నటించారు. ఈ నెల 25న సినిమా విడుదల కానుందని, ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నగరానికి వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.**

తొలి చిత్రం ప్రారంభం తీపి గురుతు

విజయభాస్కర్ దర్శకత్వంలోని 'ప్రేమకావాలి' నా తొలి చిత్రం. మెగాస్టార్ చిరంజీవి , అక్కినేని నాగార్జున, నందమూరి బాలకృష్ణ సమక్షంలో ప్రారంభమవడం జీవితంలో మరిచిపోలేను. వారందరి ముందు తొలి షాట్‌తో సినిమా అరంగ్రేటం చేశా. వారి ఆశీస్సులతో పాటు తెలుగు ప్రేక్షకులు గుర్తించారు. మొదటి సినిమాతోనే స్టార్‌ఇమేజ్‌ను అందించారు.



విశాఖలోనే నట శిక్షణ

నటనలోని మెలకువలు విశాఖలోని స్టార్ మేకర్ ఎల్.సత్యానంద్ వద్ద తెలుసుకున్నా. ఇక్కడ చాలా ప్రాంతాల పేర్లు నాకు బాగా తెలుసు. నా ప్రతి చిత్రానికి విశాఖ రావడం సెంటిమెంట్‌గా మారింది. విశాఖ బీచ్‌ను చూస్తే రిలీఫ్‌గా ఉంటుంది.

తాత,తండ్రి పేర్లను నిలబెడతా

నటనలో తాత పీజే శర్మ, తండ్రి సాయికుమార్ పేరును నిలబెడతా. ఇప్పటివరకు 21 చిత్రాల్లో హీరోగా నటించా. కొన్ని చిత్రాలు ఆడలేదు. వాటి నుంచి చాలా తెలుసుకున్నా. శంబాలతో కెరీర్ పూర్తిస్థాయిలో నిలదొక్కుకుంటుందని నమ్ముతున్నా.

నాన్న చిత్రాల్లో

నాన్న చిత్రాలు మరెవరూ చేయలేరని నా అభిప్రాయం. పోలీస్‌స్టోరీ, అంతఃపురంలోని ఆయన నటన సహజంగా ఉంటుంది. అంతఃపురంలోని అసలేం గుర్తుకురాదు.. పాటను రీమెక్ చేయాలని ఉంది. కృష్ణవంశీ దర్శకత్వంలోనే చేస్తా.

క్రికెటర్ అయ్యేవాడిని

హీరో కాకపోయి ఉంటే క్రికెటర్ అయ్యేవాడిని. చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే చాలా ఇష్టం. హీరో కావాలని కాలేజీ రోజుల్లోనే నిర్ణయించుకున్నా. ఇప్పటికీ సీసీఎల్ ఇతర మ్యాచ్‌లు ఆడుతుంటా.

తెలుగుపై పట్టు

తాత, నాన్న, బాబాయ్‌లు తెలుగు గురువులు. వారి వద్ద పద్యాలు, పెద్దడైలాగ్స్ నేర్చుకున్నా. సాయికుమార్ నిర్వహించిన ప్రత్యేక షోలో వారిలో కలిసి భారీ డైలాగ్స్ చెప్పిన క్షణాలు మరిచిపోలేను.

మాస్ మూవీస్...

మాస్ మూవీస్‌లో నటించాలనుంది. ప్రేమకావాలి. శశి..రఫ్..సుకుమారుడు చిత్రాల్లో మాస్ కూడా ఉంది. అ తరహాలోనే చేయాలనుకుంటున్నా.

హీరో ప్రభాస్ కారణం

శంబాల చిత్రానికి హైప్ రావడానికి డార్లింగ్ ప్రభాస్ అన్నే కారణం. టీజర్‌ను ఆయన విడుదల చేశారు. ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది.

భవిష్యత్తులో..

ప్రస్తుతం శంబాల విడుదలకు సిద్ధంగా ఉంది. మరో మూడు సినిమాల్లో నటిస్తున్నా. వివరాలు త్వరలో చెబుతా.

20న అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

కొత్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జలగలమదుం కూడలిలో ఈ నెల 20న అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగనున్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, జనసేన పార్టీ నాయకుడు విల్లూరి హరికృష్ణ తెలిపారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మోదీ సుపరిపాలన యాత్ర ఈ నెల 11న ధర్మవరంలో ప్రారంభం కానుందన్నారు. ఈ యాత్ర ఈ నెల 20న అనకాపల్లికి చేరుకుంటుందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ నేతృత్వంలో సాయంత్రం 4 గంటలకు జలగలమదుం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ జరుగుతుందని, అనంతరం బహిరంగ సభ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు హాజరు కానున్నారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కాగా జలగలమదుం కూడలిని అటల్‌జీ పార్కుగా నామకరణ చేయాలనే ఆలోచనలో ఉన్నామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు పలకా రవి, బీజేపీ నాయకులు వర్మ, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, చిత్రంలో తాతయ్యబాబు, తదితరులు

750 సెల్‌ఫోన్లు రికవరీ.. బాధితులకు అందజేత

అనకాపల్లి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించడంలో జిల్లా పోలీసు శాఖ విశేషంగా కృషి చేసిందని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం 11వ విడత మొబైల్ రికవరీ మేళాను నిర్వహించారు. ఈ మేళాలో ఎస్పీ పాల్గొని గత రెండు, మూడు నెలల కాలంలో రికవరీ చేసిన సుమారు 750 మొబైల్ ఫోన్‌లను బాధితులకు అందజేసారు. వీటి విలువ రూ 1.5 కోట్లు ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్లు రికవరీ చేసేందుకు విశేషంగా కృషి చేసిన ఐటీకోర్ బృందాన్ని ఎస్పీ అభినందించి నగదు రివార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దేవాప్రసాద్, మోహనరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను బాధితురాలికి అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ఇన్‌సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

- ఆర్డీవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ నిరసన

అనకాపల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం యూటీఎఫ్ ప్రతినిధులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ టెట్ అనేది 2010లో ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఆ తరువాత ప్రకటించిన అన్ని డీఎస్సీల్లో టెట్ పరీక్షలు కూడా కలిపి నిర్వహించారన్నారు. అయితే 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ రాసుకునే అవకాశం 2010కి ముందు లేదన్నారు. ఇటీవల సుప్రీం కోర్టు ఉపాధ్యాయులందరూ టెట్ పాసు అవ్వాలి లేదా ఉద్యోగాలు వదులు కోవాలని వ్యాఖ్యానించిన ఫలితంగా దేశ వ్యాప్తంగా లక్షల మంది ఉపాధ్యాయుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అందు వలన ప్రభుత్వం వెంటనే సుప్రీం కోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో షేక్ అయిషాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు జి.ఎస్.ప్రకాశ్, నడిగెట్ల శేషుకుమార్, నాగమణి, చింతాడ వెంకటరమణ, సత్యవేణి పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

వరహా నదికి కాలుష్య ముప్పు

... 7వ పేజీ తరువాయి

వస్తున్నదని దిగువ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన బోర్లు, ఇన్‌ఫిల్టర్ బావుల్లో నీరు కూడా కలుషితం అవుతున్నది. ఇంకా గ్రోయిన్ కాలువల ద్వారా వందలాది ఎకరాలకు అందే నీరుసైతం కాలుష్యమై, పంట భూమి పాడైపోతున్నదని రైతులు వాపోతున్నారు. జలవనరులు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు స్పందించి వరహా నదిలో చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎలమంచిలి మండలం ఏటికొప్పాక వైపు నది గట్టుపై వ్యర్థాలు

నేడు ఎలమంచిలి ఎంపీపీ ఎన్నిక

... 7వ పేజీ తరువాయి

మండల పరిషత్ ప్రత్యేక సమవేశంలో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఎంపీడీవో ఈ విషయాన్ని జడ్పీ సీఈవోకు తెలిపరిచారు. గత నెల 26వ తేదీన గోవింద్‌ను ఎంపీపీ పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ ఎంపీపీ రాజాన శేషుకు ఇన్‌చార్జి ఎంపీపీ బాధ్యతలు అప్పగించారు. తరువాత కొత్త ఎంపీపీ ఎన్నికకు ప్రకటన జారీ చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ హాలులో ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తామని, ఎన్నికల పరిశీలకులుగా జాయింట్ కలెక్టర్ జాహ్నవి హాజరవుతారని ప్రిసైడింగ్ అధికారి పీకేపీ ప్రసాద్ తెలిపారు. ఎంపీపీగా రాజాన సూర్య చంద్రశేషగిరిరావు(శేషు) బరిలో దిగనున్నారు. మెజారిటీ సభ్యులు ఆయనవైపే వుండడంతో ఎంపీపీగా ఎన్నిక కావడం లాంచనమేనని భావిస్తున్నారు.

బాల్యానికి మూడు ముళ్ల బంధనం

... 7వ పేజీ తరువాయి

అనర్థాల గురించి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పట్టించుకోవడంలేదు. ముఖ్యంగా గర్భవతి అయిన తరువాత ప్రసవ సమయంలో ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్టు సమాచారం అందితే.. అధికారులు అక్కడకు వెళ్లి పెళ్లిని ఆపడంతోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయితే సామాజిక పరిస్థితుల కారణంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకోలేకపోతున్నారు.

జిల్లాలో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి చివరి వరకు 87 బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. ఇక ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి నవంబరు 25వ తేదీ వరకు 40 బాల్య వివాహాలకు బ్రేకులు వేశారు.

బాల్ వివాహ్ ముక్త భారత్

కాగా బాల్య వివాహ రహిత సమాజం కోసం 'బాల్ వివాహ్ ముక్త భారత్' పేరుతో ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికను రూపొందించింది. మొదటి విడత ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో, రెండో విడతలో ఆయా మతాల పెద్దలకు, మూడో విడతలో గ్రామ స్థాయి నాయకులకు అవగాహన కల్పిస్తారు. నవంబరు 27వ తేదీన ప్రారంభించిన ఈ కార్యక్రమాలను మార్చి 8వ తేదీ వరకు నిర్వహిస్తారు. డిసెంబరులో అన్ని విద్యా సంస్థల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తారు. బాల్య వివాహాలను అరికట్టడానికి గ్రామ, మండల, జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామ కమిటీలో సర్పంచ్ ఛైర్మన్‌గా, మహిళా పోలీసు కన్వీనర్‌గా, పాఠశాల హెచ్‌ఎం, ఆశా కార్యకర్త, వీఆర్‌వో, ఏఎన్‌ఎం అంగన్‌వాడీ కార్యకర్త సభ్యులుగా ఉంటారు. మండలస్థాయి కమిటీలో తహశీల్దార్ ఛైర్మన్‌గా, జిల్లాస్థాయి కమిటీలో కలెక్టర్ ఛైర్మన్‌గా ఉంటారు. సచివాయ మహిళా పోలీసు 15 రోజులకు ఒకసారి గ్రామ కమిటీలు సమావేశం ఏర్పాటు చేయాలి. మైనర్ బాలికలు ఉన్న తల్లిదండ్రులను పిలిపించి బాల్య వివాహల వల్ల జరిగే నష్టాలు, అనర్థాలు, చట్టం గురించి అవగాహన కల్పిస్తారు. సీడీపీవోలు ప్రతి శుక్రవారం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి అవగాహన సదస్సులు నిర్వహించాలి. 11 నుంచి 14 సంవత్సరాలు, 15 నుంచి 18 సంవత్సరాలలోపు వయసున్న బాలికలను రెండు గ్రూపులుగా చేసి బాల్య వివాహల వల్ల జరిగే అనర్థాల గురించి తెలియజేయాలి. ఇంకా వివాహాలు జరిపించే పురోహితులు, చర్చి ఫాదర్లు, మసీదుల్లో ఇమామ్‌లతో సమావేశాలు నిర్వహించి బాల్య విహాల నిరోధక చట్టం గురించి వివరించాలి.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఏడిద దిలీప్‌కుమార్ (ఫైల్ ఫొటో)

ఎస్.రాయవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగొల్లు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ విభీషణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని లింగరాజుపాలెం గ్రామానికి చెందిన ఏడిద దిలీప్‌కుమార్(20) తన స్నేహితులైన అదే గ్రామానికి చెందిన నలమాటి జగన్, ఎస్.రాయవరానికి చెందిన జితేంద్రకుమార్‌తో కలిసి బైక్‌పై మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో భోజనానికి పెనుగొల్లు సమీపంలోని హోటల్‌కు వెళ్లారు. భోజనం లేదని హోటల్ సిబ్బంది చెప్పడంతో వెనుదిరిగారు. జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో అనకాపల్లి నుంచి తుని వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను బలంగా ఢీకొంది. బైక్ నడుపుతున్న దిలీప్‌కుమార్‌తో పాటు మిగతా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించగా, వీరిలో దిలీప్‌కుమార్ అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగతా ఇద్దరినీ విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారని, వారికి ప్రాణాపాయం లేదని ఎస్‌ఐ తెలిపారు.

483 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

రోలుగుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.నాయుడుపాలెంలో అక్రమంగా తరలించడానికి పది గోనె సంచుల్లో సిద్ధం చేసిన 483 కిలోల రేషన్ బియ్యాన్ని బుధవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి రత్నంపేట గ్రామానికి చెందిన పెనుగొండ సోమరాజును అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌరసరఫరాల గోదాముకు తరలించారు. సోమరాజుపై 6ఏ కేసు నమోదు చేసినట్టు తహసీల్దార్ నాగమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రామమూర్తి, వీఆర్వో గోవర్దన్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో తహసీల్దార్ నాగమ్మ, రెవెన్యూ సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కొయ్యూరు, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పెదమాకవరం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామరాజుపాలేనికి చెందిన లోతా రాజు, కంపరేగులకు చెందిన పనసల సత్తిబాబు, రాజబాబు బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై కంపరేగుల గ్రామానికి బయలుదేరారు. దారిలో పెదమాకవరం వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో లోతా రాజు, పనసల సత్తిబాబు తీవ్రంగా గాయపడ్డారు. ఇదే సమయానికి అటుగా వెళుతున్న కొయ్యూరు ఎస్‌ఐ కిశోర్‌వర్మ ఆగి, క్షతగాత్రులను కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం సత్తిబాబు పరిస్థితి విషమంగా వుండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పంపారు.

టిడ్కో కాలనీలో యువకుడి వీరంగం

- కారు, ఆటో అద్దాలు ధ్వంసం





యువకుడి దాడిలో పగలిన కారు, ఆటో అద్దాలు

ఎలమంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక టిడ్కో గృహ సముదాయం వద్ద మంగళవారం అర్ధరాత్రి ఒక యువకుడు వీరంగం సృష్టించాడు. పలు వాహనాల అద్దాలను పగులగొట్టాడు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. టిడ్కో కాలనీకి చెందిన ఒక మహిళతో హైదరాబాద్‌కు చెందిన కార్తీక్ అనే వ్యక్తికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. కొంతకాలంగా ఫోన్‌లో మాట్లాడుకున్నారు. తరువాత అతని ప్రవర్తన నచ్చకపోవడంతో మాట్లాడడం మానేసింది. దీంతో యువకుడు హైదరాబాద్ నుంచి మంగళవారం టిడ్కో కాలనీకి వచ్చి ఆమెతో గొడవ పడ్డాడు. ఆమె నివాసం ఉంటున్న బ్లాక్ కింద ఉన్న ద్విచక్ర వాహనాలను కిందపడేసి కారు, ఆటో అద్దాలను పగులగొట్టాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ సావిత్రి తెలిపారు.

టెట్‌కు 91.05% హాజరు

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు కేంద్రాల్లో బుధవారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. తొలిరోజు మొత్తం 2,001 మంది అభ్యర్థులకుగాను 1,822 మంది (91.05 శాతం) హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈనెల 21వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 26,248 మంది టెట్‌కు సంబంధించి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరి కోసం నగరంలో 12 కేంద్రాలు ఏర్పాటుచేశారు. మొదటి రోజు ఐదు కేంద్రాల్లోనే పరీక్ష నిర్వహించారు.

ఈ-ఫైళ్ల పరిష్కారం వేగవంతం!

... 7వ పేజీ తరువాయి

సెప్టెంబరు 9వ తేదీ నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు కలెక్టర్ విజయకృష్ణన్ లాగిన్‌లో వివిధ రకాల ఈ-ఫైల్స్ పాతవి 56తో కలిపి 529 పెండింగ్‌లో ఉండగా అన్నింటినీ (549) పరిష్కరించారు. 2024 జూలై నుంచి ఈ నెల 9వ తేదీ వరకు కలెక్టర్ లాగిన్‌లో మొత్తం 4,099 ఫైల్స్‌లో 4,093 ఫైల్స్ క్లియర్ చేశారు. జేసీ జాహ్నవి గడిచిన మూడు నెలల్లో తన లాగిన్‌లో 19 బ్యాలెన్స్ ఈ-ఫైల్స్‌తో కలిపి మొత్తం 493 ఫైల్స్‌లో 486 క్లియర్ చేశారు. అంతకు ముందు 2024 జూలై నుంచి ఈ ఏడాది డిసెంబరు 9వ తేదీ వరకు జేసీ లాగిన్‌లో మొత్తం 2,791 ఫైల్స్ పెండింగ్‌లో ఉండగా 2,770 ఫైల్స్ క్లియర్ చేశారు. కోర్టుల పరిధిలో వున్న వివాదాస్పత భూముల అర్జీలు మాత్రమే పెండింగ్‌లో వున్నాయి.

ఈ రోడ్లకు మోక్షమెన్నడో!?

... 7వ పేజీ తరువాయి

గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతుల కారణంగా రాత్రిపూట ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఇక మండలంలో మరో ప్రధానమైన అంబేరుపురం, రాయపురాజుపేటలను కలిపే ఆర్‌ఆర్ పేట రహదారి పనులు సైతం శిలాఫలకంతోనే ఆగిపోయాయి. ఈ రోడ్డు అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644